వేదాంతభేరి

సంస్థాపకులు : శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు

సంపుటము : 52 జూన్ 2019 సంచిక : 06

సంపాదకులు

శ్రీ విద్యాస్వరూపానందగిరి స్వాములవారు

సంపాదక మండలి

శ్రీ సంపూర్ణానందగిరి స్వాములవారు

శ్రీవిజయానంద బ్రహ్మచారి

కె.ఈశ్వర్

డాక్టర్ సముద్రాల లక్ష్మణయ్య,శిరోమణి, ఎం.ఎ.,

డాక్టర్ కె.సర్వోత్తమరావు,ఎం.ఎ., పి.హెచ్.డి.,

శాశ్వత పోషక చందా రూ. 1500/- అంతకుమించి

సంవత్సర చందా రూ. 100/-లు, విడి సంచిక రూ. 10/-లు

విదేశాలకు సంవత్సర చందా (ఎయిర్ మెయిలు) 20 డాలర్లు

చందా పంపవలసిన అడ్రసు : శ్రీ శుకబ్రహ్మాశ్రమము,
స్వామి విద్యాప్రకాశానంద నగర్,
శ్రీ శుకబ్రహ్మాశ్రమము (పోస్టు)
శ్రీకాళహస్తి, పిన్ - 517640
ఫోన్ : 08578- 222239

చందాదారులు ఉత్తర ప్రత్యుత్తరాలలో తమ చందా నెంబరు తప్పక వ్రాయవలెను.

Printed & Published by Sri Vidyaswarupanandagiri swami on behalf of Sri Sukabrahma Ashramam and Printed by B.Viswanadham at C.N. Printer, TIRUPATI, Andhra Pradesh; Published at Sri Sukabramhasramam, Swami Vidyaprakashananda Nagar, Sri Sukabramhasramam Post, Srikalahasti-517 640, Chittoor Dist., Andhra Pradesh.

Editor : SRI VIDYASWARUPANANDA GIRI SWAMI

వేదాంతభేరి

అనుష్ఠాన వేదాన్తాన్ని బోధించు మాసపత్రిక

సంపుటము : 52 జూన్ 2019 సంచిక : 06

విషయ సూచిక

01. ప్రార్థన - 05
02. నమే భక్తః ప్రణశ్యతి -శ్రీ విద్యాప్రకాశానందగిరిస్వాములవారు - 06
03. భగవంతుడు కల్పవృక్షము - శ్రీరామకృష్ణపరమహంస - 11
04. అవిద్యా విచారణ - 2 - శ్రీ సంపూర్ణానందగిరి స్వాములవారు - 13
05. శ్రీమలయాళస్వామి జీవిత విశేషాలు - స్వీయ రచనలు
- డా॥ సముద్రాల లక్ష్మణయ్య - 17
06. జ్ఞానసుధ - శ్రీశంకరానందగిరి స్వాములవారు - 20
07. ఉద్ధవగీత - సత్సంగము - యేలేశ్వరపు హనుమ రామకృష్ణ - 21
08. అమర నారేయణ సందేశం - ఆచార్య కె.సర్వోత్తమరావు - 25
09. ఆంధ్ర మహాభాగవతము - ఆచార్య జక్కంపూడి మునిరత్నం - 29
10. ఎవ్వరితో విరోధం? ఎందుకు విరోధం?
- డా॥ పులివర్తి కృష్ణమూర్తి. - 33
11. అహింసా పరమో ధర్మః - శ్రీమలయాళస్వాములవారు - 36
12. వార్తలు - 42

ముఖచిత్రం శ్రీమన్నారాయణుడు

నైతిక సిద్ధాంతములు లేని రాజకీయములు,
దాన ధర్మములేని ధనము,
సద్గుణములు లేని విద్య,
మానవత్వము లేని విజ్ఞానము,
త్యాగము లేని కర్మ - వ్యర్థము

ఇందులోని వ్యాసముల భావములకు వ్యాస రచయితలే బాధ్యులు

ప్రార్థన

– నారదుడు

1. ఓం అవ్యక్తం శాశ్వతం దేవం ప్రభవం పురుషోత్తమమ్ ।
ప్రపద్యే ప్రాఞ్జలిర్విష్ణుం అక్షరం పరమం పదమ్ ॥

2. పురాణం ప్రభవం నిత్యం అక్షయం లోకసాక్షిణమ్ ।
ప్రపద్యే పుణ్డరీకాక్షం ఈశం భక్తానుకమ్పినమ్ ॥

3. లోకనాథం సహస్రాక్షం అద్భుతం పరమం పదమ్ ।
భగవన్తం ప్రపన్నోఽస్మి భూతభవ్య భవత్ప్రభుమ్ ॥

4. స్రష్టారం సర్వలోకానాం అనన్తం విశ్వతోముఖమ్ ।
పద్మనాభం హృషీకేశం ప్రపద్యే సత్యమచ్యుతమ్ ॥

5. హిరణ్యగర్భమమృతం భూగర్భం పరతః పరమ్ ।
ప్రభోఃప్రభుమనాద్యన్తం ప్రపద్యే తం రవిప్రభమ్ ॥

6. సహస్రశీర్షం పురుషం మహర్షిం తత్త్వభావనమ్ ।
ప్రపద్యే సూక్ష్మమచలం వరేణ్యమభయప్రదమ్ ॥

7. నారాయణం పురాణర్షిం యోగాత్మానం సనాతనమ్ ।
సంస్థానం సర్వతత్త్వానాం ప్రపద్యే ధ్రువమీశ్వరమ్ ॥

8. యః ప్రభుః సర్వభూతానాం యేన సర్వమిదం తతమ్ ।
చరాచర గురుర్విష్ణుః స మే దేవః ప్రసీదతు ॥

9. యస్మాదుత్పద్యతే బ్రహ్మ పద్మయోనిః పితామహః ।
బ్రహ్మయోనిర్హి విశ్వాత్మా స మే విష్ణుః ప్రసీదతు ॥

ఓం నమో భగవతే వాసుదేవాయ, ఓం నమః పితామహాయ, ఓం నమః ప్రజాపతిభ్యః, ఓం నమః కృష్ణద్వైపాయనాయ, ఓం నమః సర్వవిఘ్న వినాయకేభ్యః ॥ **(భారతం – ఆదిపర్వం)**

ఈ మన్త్రాన్ని రోజూ ఉదయం, సాయంకాలం జపించేది.

'న మే భక్తః ప్రణశ్యతి'

– శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు

"నమే భక్తః ప్రణశ్యతి", 'న హి కల్యాణకృత్కశ్చిద్దుర్గతిం తాత గచ్ఛతి' అనగా 'నా భక్తుడెన్నటికిని చెడడు', 'సత్కార్య మాచరించువానికి దుర్గతి యెన్నటికిని గలుగదు' – అను ఈ ప్రకారములగు భగవంతుని ప్రతిజ్ఞాపూర్వక వచనములను సంస్మరించుకొని, జనులు అఖండ ధైర్యోత్సాహసమన్వితులై, వెనుక చూపులేక, ఆత్మమార్గమున ఇతోధికముగ యత్నించవలయును.

'ఉత్తిష్ఠత ! జాగ్రత! ప్రాప్య వరాన్నిబోధత'! మున్నగు ఉపనిషద్వాక్యములు 'అజ్ఞాన నిద్రనుండి మేలుకొనుడు! ఆత్మవిషయమున జాగరూకులై యుండుడు! మహాత్ముల ద్వారా ప్రబోధము నందుడు!' అని జనులను హెచ్చరించుచున్నవి. వాని నాలకించి దైవప్రోక్తములగు ఆ వాక్యములపై అచంచల విశ్వాసము గలిగి తద్రీతి అనుష్ఠించుటకై ఉపక్రమించవలయును. ఎపుడు జనులు తమ లక్ష్యప్రాప్తికై దృఢనిశ్చయులై, సర్వేశ్వరునియెడల అనుపమ భక్తి గలిగి కార్యమున కుపక్రమించుదురో, అపుడిక ప్రపంచమునందలి ఏ శక్తియు అక్కార్యమునుండి వారిని నిరోధించుటకు సమర్థము గాజాలదు. మఱియు ఏ జాతివారైనను, ఏ మతమువారైనను, స్త్రీలైనను, పురుషులైనను, హిందువులైనను, మహమ్మదీయులైనను, బ్రాహ్మణులైనను, చండాలురైనను శమదమాది గుణములు గల్గియున్నచో, అపరోక్షాత్మానుభూతి యను చరమ లక్ష్యమును సాధించుటకు అర్హులే. బ్రహ్మత్వప్రాప్తి జాతి, నామ, ఆశ్రమాదులపై నెన్నటికిని ఆధారపడి యుండదు. యోగ్యతయే ప్రధానము. ఎట్టి నీచకులమందు జన్మించినవాడైనను బాగుగ విద్యనభ్యసించి గొప్ప

ఉద్యోగమును సంపాదించినచో,ఆ యుద్యోగమునకు సంబంధించిన అధికార మెట్లాతనికి లభించునో, అట్లే జాతివర్ణాశ్రమము లేవియై యున్నప్పటికిని, బ్రహ్మనిష్ఠచే బ్రహ్మత్వమును తప్పక పొందగలరు. లేక బ్రహ్మరూపుడే కాగలడు.

దేశములన్నియు నేడు తమ స్వాతంత్ర్య 'హక్కు' నకై యెట్లు పోరాడు చున్నవో, అదేవిధముగ సర్వమానవులను అట్టి తమ నైజస్వారాజ్య 'హక్కు'నకై పోరాడవలసి యున్నది. తన యాత్మస్వరూపమును బొందుటకు తనకు హక్కు లేదా? భగవత్ప్రోక్తమగు వేదవిద్య నభ్యసించుటకుగాని, లేక భగవంతుని పొందుటకుగాని, భగవంతుని బిడ్డలే యగుటవలన సర్వమానవులకును గూడ సమానమైన హక్కు గలదు. కావున జాతి మత కుల వివక్షత లేక సాధన చతుష్టయరూపయోగ్యత గలిగియున్నచో, సర్వులును ఈ పరమోన్నతమగు బ్రహ్మవిద్యను బడసి జన్మరాహిత్యమును, నిత్యానంద పదవిని అధిష్ఠింపవచ్చును. ఉత్తమ యోగ్యత, అనుష్ఠానము, సదాచరణ, భగవద్భక్తి, అకుంఠిత కార్యదీక్ష యున్నచో, ఇక్కార్యమున అనగా స్వారాజ్య సంపాదనమున ఎవ్వరికైనను విజయము తప్పక లభింపగలదు.

క్షణికములును, అశాశ్వతములును, పరమానందప్రాప్తి రహితములునగు స్వల్పస్వల్ప ప్రాపంచిక లక్ష్యములకై జీవితములను ధారవోయుటకంటె శాశ్వతమై, ఇహపర శ్రేయోదాయకమై, సర్వోన్నతమై, నిత్యానందప్రదమైనట్టి బ్రహ్మాత్మైక్యరూప చరమలక్ష్యమును సాధించుటకై యేల ప్రయత్నము సలుపరాదు?

" Better to aim at a lion and miss it, rather than hunt a jackal and catch it "- అను నొక ఆంగ్ల లోకోక్తి గలదు. దానియర్థమేమనిన - వెంటాడి నక్కను బట్టుకొనుటకంటె తప్పిపోయినను

సరే సింహమునకే గురి పెట్టుట మంచిది. అట్లే చిన్న చిన్న సాంసారిక లక్ష్యములను జీవితాంతమువఱకు వట్టి వ్రేలాడుటకంటె పూర్ణశోకశాంతి ఆనందప్రాప్తి గలుగజేయు భగవత్సాక్షాత్కారమునకై యత్నించుట మేలు.

కాని బహుజన్మార్జితములగు ప్రాపంచిక వాసనలు, సంస్కారములు జీవులలో ఘనీభవించియుండుటచే ప్రారంభముననే అక్కార్యమున విజయము కలుగకపోవచ్చును. కొన్ని యాటంకములు, ప్రతిబంధములు కలుగవచ్చును. ప్రయత్నము మందముగానున్నచో, లక్ష్యప్రాప్తికి కొన్ని జన్మలైనను పట్టవచ్చును. తీవ్రముగనున్నచో, ఈ జన్మయే చాలును. ఏది యెట్లున్నను గమ్యము చేరువరకు ప్రయత్నమును మాత్రము వీడరాదు.

ప్రారభ్యతే న ఖలు విఘ్నభయేన నీచై
ప్రారభ్య విఘ్నవిహతా విరమన్తి మధ్యాః
విఘ్నైర్ముహుర్ముహురపి ప్రతిహన్యమానాః
ప్రారబ్ధము త్తమగుణా న పరిత్యజన్తి.

అని భర్తృహరి వచించినట్లు అధములు అసలు సత్కార్యమును ప్రారంభింపనే ప్రారంభింపరు. మధ్యములు ప్రారంభించి విఘ్నములు వచ్చుసరికి దానిని వదలివేయుదురు. కాని ఉత్తములో ఎన్ని విఘ్నములు పదేపదే సంభవించినప్పటికిని, ఎన్ని ప్రతిబంధకములు, ఇక్కట్లు దాపురించినప్పటికిని, ప్రారంభించిన సత్కార్యము నెన్నటికిని విడనాడరు. అయితే మనస్సను ప్రబల శత్రువును నిర్జించుటకు, ఆ గొప్ప ఆసురీశక్తి నెదుర్కొనుటకు ద్విగుణీకృతమగు దైవికశక్తి అవసరము. సర్వేశ్వరునియెడల నిర్మలభక్తి గలిగియున్ననే అయ్యది సాధ్యమగును. ఏలయనగా.

'మాయాంతు ప్రకృతిం విద్యాన్మాయినంతు మహేశ్వరమ్'

అని చెప్పబడుటవల్ల ప్రకృతిరూపమగు మాయ ఈశ్వరునికి అధీనమైయున్నదిగావున ఆ మాయను జయింపవలెనన్న మాయాధీశుఁడగు ఈశ్వరుని యనుగ్రహము తప్పక పొందియే తీరవలెను. అదియో నిష్కామకర్మ, భక్తిమున్నగువానిచేతనే కలుగును. కాబట్టి హృదయ పూర్వకముగ సర్వేశ్వరుని నిర్మలభక్తితో నారాధించుచు, వైరాగ్య, వివేక, విచారణాదులుగలవారై, శ్రద్ధతో ఆధ్యాత్మిక సాధనలను కొనసాగించిన, అచిరకాలములోనే ప్రతిబంధకములన్నియు పలాయనములైపోయి లక్ష్యము కరతలామలకముగ గోచరించును, అత్తరి, దేనిచే జీవరాసులన్నియు బంధింపబడినవై సత్యవస్తువు నెఱుఁగ జాలకున్నవో, ఏది ఉన్న దానిని లేనిదిగను, లేనిదానిని ఉన్నదిగను కల్పించి నాటకమాడుచున్నదో, అట్టి దురతిక్రమమగు మాయ క్షణకాలములో జీవునకు బేషరతుగ లొంగిపోవును. (Unconditional surrender of Maya) అట్టి స్థితియే మోక్షము, అదియే స్వారాజ్యము.

స్వరాజ్యప్రాప్తికై భారతీయులు ఎన్నియో వత్సరములు అనేక యిడుముల బడవలసివచ్చెను. లాఠీ దెబ్బలను, ఫిరంగిగుండ్లను సహింపవలసి వచ్చెను. పెక్కు త్యాగములు గావింపవలసి వచ్చెను. అట్టిచో నిక స్వారాజ్యరూపమగు బ్రహ్మత్వప్రాప్తికై ఎన్ని కష్టముల నోర్వవలెనో, ఎంత సాహసము చూపవలెనో, ఎన్ని త్యాగముల జేయవలెనో యోచించుకొనుడు ! ఒక చిన్న యుద్యోగమును సంపాదింప వలెనన్నగాని, ఒక పరీక్ష ప్యాసుకావలెనన్నగాని రాత్రింబగళ్లు జనులు కృషి చేయుచున్నారు కదా! ఇక ఎద్దాని యందు గంధర్వ, ఇంద్ర, బ్రహ్మదేవుల సంపదయు, ఆనందమున్ను లవలేశములే అయివున్నవో, అట్టి బ్రహ్మానందపదవి నలంకరించుటకై అధిక ప్రయత్నమేల చేయరాదు?

కావున ఘోరతమస్సునందు కూలద్రోయు నాస్తికుల

ప్రలాపములకు చెవియొగ్గక, నిర్భీకులై సత్యమార్గమున, ఆత్మమార్గమున జనుదురుగాక! త్రోవలో దుఃఖములు వచ్చునా? అవియన్నియు సుఖములే? అనంతానందపదవి నొందబోవుచుండ మార్గమున తగులు శ్రమ శ్రమకాదు. శ్రేయమేయగును. ఇక భయము దేనికి? మృత్యువునకా? అది జీవులను పిలువకమునుపే, జీవులే తమపని పూర్తిచేసికొని దానిని ఆహ్వానించుస్థితిలో బాగుగ తయారైయున్నచో ఇక అది వారల నేమిచేయగలదు? చేయవలసిన పని (ఆత్మ జ్ఞాన సంపాదనము) పూర్తి అయినచో ఇక మృత్యువు వచ్చిననేమి, రాకున్ననేమి? 'మృత్యుస్తం న జిఘాంసతి' అనునట్లు అట్టి కృతకృత్యునిక మృత్యువు హింసింపజాలదు. మఱియు 'మరణం మంగళం భవేత్' అనులాగున అట్టి మరణము మంగళమే యగును. కాబట్టి నిర్భయ చేతస్కులై, గమ్యస్థానమగు పరమాత్మను చేరువరకు వెనుకకు మరలక, భక్తి, జ్ఞానవైరాగ్యాది సాధన సంపత్తితోగూడి, ధైర్యోత్సాహములతో ఆత్మమార్గము ననుగమించుచు, సర్వేశ్వరుని కృపచే ఈజన్మయందే, జన్మహక్కైనట్టి స్వారాజ్యము (మోక్షము)ను సంపాదించి జనులు కృతకృత్యులు కావలయును.

'అహో ఉ స్మాకమలం మోహైరాత్మా బ్రహ్మేతి నిర్భయమ్'

'దేహేంద్రియమనంబులకు సాక్షియై విలసిల్లు ఈ ప్రత్యగాత్మయే పరబ్రహ్మము! కాబట్టి దానిని తెలిసికొని నిర్భయులై యుండుడు' అని యీ ప్రకారముగ మహాత్ములగు గురువులు, ఋషిసత్తములు మ్రోగించిన వేదాంతడిండిమము, అద్వైతజయభేరి అప్రతిహతనాదంబున జనుల కర్ణ గోళములందు నిరంతరము ప్రతిధ్వనించుచు కర్తవ్యమునకై పురిగొల్పుగాక! ఆ దివ్య నిస్వనము దశదిశలు పిక్కటిల్లునట్లు ముఖరితమై ఎల్లెడల వ్యాపించి, జనుల హృదయాంతరాళములను ఆత్మోన్ముఖమగునట్లు ప్రభావిత మొనర్చుగాక !

భగవంతుడు కల్పవృక్షము

- శ్రీ రామకృష్ణ పరమహంస

ఒక బాటసారి గ్రామాంతరమునకు పోవుచూ దారిలో ఒక మైదానమును జేరుకొనెను. ఎండలో నడచుచున్నందున అతనికి ముచ్చెమటలు పట్టెను. విశ్రమించనిదే నడువలేని స్థితి వచ్చెను. గావున అటునిటు జూడగా సమీపంలో ఒక చెట్టు యుండెను. అంత నాతడు ఆ చెట్టుక్రింద గూర్చొండెను. ఎండతాపము నుండి చెట్టు నీడను జేరుటచే అతనికి హాయిగా నుండెను. అంత గొంతసేపటికి ఆతడు నిదురించుటకు తనకు ఒక పాన్పు చిక్కిన ఎంత బాగుండును! అని వూహించ నారంభించెను. అతను గూర్చున్నది కల్పవృక్షము క్రింద కాని అతని కా విషయము తెలియనే తెలియదు. పైరీతిగా కోరిక అతని మనస్సులో తోపగనే తన ప్రక్కన చక్కని పాన్పు గనిపించెను. దానిని చూచి అతడమితాశ్చర్యము నొంది దానిపై పరుండెను. మరికొంతసేపటికి పరుపు బాగుంది ఇపుడొక అందమైన స్త్రీ ప్రక్కన యుండి నా కాళ్లు పట్టుచుండిన (ఒత్తుచుండిన) హాయిగా వుండును గదా! అనుకొనెను. ఈ తలంపు గలుగగానే ఒక సుందరి వచ్చి తన పాదముల నొత్త నారంభించెను. అది గనిన ఆ బాటసారి పరమానందభరితుడాయెను. ఇంతలో నాతనికి ఆకలి ఆయెను. అంత నాతడు "నేను కోరినదంతా వచ్చినదే ! ఈ ఆహారం గూడా లభిస్తే ఎంత బాగుండును" అనుకొనెను. అతడట్లు వూహించీ వూహించకముందే అతని ఎదుట షడ్రసోపేతములైన రకరకాల పదార్థాలుగల భోజనము సిద్ధమాయెను. వెంటనే అతడు దానిని తృప్తిగ దిని పరుపుపై పండుకొనెను. ఇపుడతను జరిగిన

దానినంతటిని యోచించ దొడగెను. ఈ యోచనలలో "ఇది మాయా? లేక నిజమా? ఒకవేళ ఇపుడు ఒక పులి వచ్చి నన్ను మింగితే ఎట్లు?" అని తలంచెను. అంతే అతని మనస్సులో ఈ యోచనరాగానే నిజముగా ఎదుట పులి గాండ్రుమంటూ అతనిపై బడి అతనిని చంపివేసెను. సాధారణముగా లోకులగతి ఇట్టిదే.

భగవంతుడు కల్పతరువు వంటివాడు. మన మేమి కోరిన దానిని భగవంతు డొసంగును. కీర్తి గౌరవముల నపేక్షించి భగవంతుని ప్రార్థించిన అవే మీకు సిద్ధించును. కానీ వాని వెనుకనే రోగము, శోకము, ధనహాని, మానహాని మొదలగు భయంకర పెద్దపులులు దాగియున్నవని మఱువకుడు. కావున పారమార్థిక సాధకుడు ఐహిక వాంఛలనన్నింటిని వదలి జాగరూకుడై కేవలం దైవసాక్షాత్కారాన్నే కోరవలెను.

వేదాన్తభేరికి ఈక్రింది వారు పోషక చందా పంపినారు

(1). ఎం.ఎస్. చలపతిరావు (మల్కాజిగిరి, హైద్రాబాద్)	-	రూ.1500/-
(2). పి.సుధాకర్ రెడ్డి (శ్రీకాళహస్తి)	-	రూ.1500/-
(3). యు.శివప్రసాద్ (మదనపల్లి)	-	రూ.1500/-
(4). ఎస్.సుబ్బరాయుడు (రాజంపేట)	-	రూ.1500/-
(5). బి.జి.శంకరరావు (కుందనహల్లి, బెంగుళూరు)	-	రూ.1500/-
(6). జి.రాఘవేన్ద్రరావు (హైద్రాబాద్)	-	రూ. 1500/-
(7). డి.నాగేశ్వరరావు (సాలెగ్రామపురం, విశాఖపట్నం)	-	రూ.2000/-
(8). జి.మార్కండేయులు (కూకట్‌పల్లి, హైద్రాబాద్)	-	రూ.1500/-
(9). జె.వి.ఎమ్.నాయుడు (విశాఖపట్నం)	-	రూ.1500/-

అవిద్యా విచారణ – 2

– శ్రీ సంపూర్ణానందగిరి స్వాములవారు

అనిత్యాఽశుచి దుఃఖానాత్మసు నిత్యశుచి సుఖాత్మఖ్యాతిరవిద్యా (ప॥యో॥సూ 2–5) **1.** అనిత్య వస్తువుల యందు నిత్యబుద్ధి **2.** అశుచి పదార్థముల యందు శుచిబుద్ధి, **3.** దుఃఖమునందు సుఖబుద్ధి, **4.** అనాత్మ యందు ఆత్మబుద్ధిని గలిగియుండుటను అవిద్యయందురు.

అనిత్యమునందు నిత్యబుద్ధి విచారణ :– అనిత్యమనగా బాధ యోగ్యం, అస్థిరం, దృశ్యం. త్రాటిని యథార్థముగా తెలుసుకొనినపుడు పాము అనే బుద్ధి లేకపోవడమే బాధ యోగ్యమందురు. స్థిరముగా నుండదు, కావున అస్థిరం. తదేవ దృశ్యం = నామరూపాత్మకమయినది. యత్‌దృశ్యం తన్నశ్యం, నశించు వస్తువునే అనిత్యమందురు.

“త్రైకాలిక నిషేధప్రతియోగిత్వం” అనిత్యమునకు లక్షణం. నీటిబుడగ వలె, ముందు వెనుకలు లేక మధ్యలో బుడగ కనుపించి అల్పకాలములోనే నష్టమగునుగాన అనిత్య మందురు. అనిత్యములైన పదార్థములు విచారణం లేక, మన దృష్టిలో నిత్య పదార్థములుగా భావించెదము. అవి ఏమనగా – పృథివ్యాధి పంచభూతములు. అనగా ఆకాశము, వాయువు, అగ్ని, జలము, భూమి, మరియు సూర్యుడు, చంద్రుడు, నక్షత్రాదులు ఇవన్నియు అనిత్య పదార్థములు. ఇవి శాశ్వతంగా నుండునని నమ్మిక బుద్ధిని అవిద్యయందురు. **ఎట్లనగా :–ఉదాహరణకు** సూర్యుని, చంద్రుని పూజించి వీరే శాశ్వతమని ఉపాసన చేసేవారు చాలామంది యున్నారు. వీరు ప్రళయ కాలములో నశించెదరు. ఏది నాశమో, ఎవరు నశించెదరో ఆ పదార్థములను అనిత్య

మందురు. సృష్టికి పూర్వము వీరెవరూ లేరు. ఈవిధముగానే యజ్ఞ రూపములో అగ్నిని కొందరుపాసించెదరు. ప్రాణయామాది రూపములో వాయువును కొందరుపాసించెదరు. మూర్తి, విగ్రహరూపములో భూమిని కొంతమంది వుపాసించెదరు. ఈవిధముగా ఆకాశ, జలాదులను ఉపాసించే వారు కొంతమంది. వీరందరూ అనిత్యములగు దేవత స్వరూపులుగాన ఉపాసపరులు ఈ శరీరము విడచిన తరువాత ఆయా లోకములందు ఉపాసన భావనకు తగు జన్మలనెత్తి ఏ ఉపాసనకు ఏ లోకములో ఎంత కాలముండవలయునో, ఆ నిర్ణయం ప్రకారము వుండి, అవధి దాటిన వెంటనే మరల భూలోకంలో జన్మనెత్తుదురు. ఇందుచే గీతలో “క్షీణే పుణ్యే మర్త్యలోకం విశన్తి” అని చెప్పబడినది. ఈ ఉపాసనను నిష్కామంగా చేసిన అంతఃకరణ శుద్ధి గలుగును. శుద్ధాంతః కరణం గలవారు ఆత్మనాత్మ విచారణ చేసి నిత్యవస్తువును తెలుసుకొని దానియందే నిదిధ్యాసను పొందిన ఈ జన్మలోనే మోక్షమును పొందెదరు.

నిత్యమనగా :– త్రికాలాబాధ్యత్వమ్ నిత్యమ్ । సర్వకాల వృత్తిత్వం నిత్యమ్। అవిచ్ఛిన్న పరంపరాకత్వం నిత్యమ్। త్రైకాలిక నిషేధ అప్రతియోగిత్వం నిత్యమ్. ఈ లక్షణములన్నియు ఒకే అర్థాన్ని తెలియజేసేవి. మూడు కాలములలో నాశములేని వస్తువును నిత్యమందురు.

అశుచియందు శుచిబుద్ధిని అవిద్యయందురు. శరీరమనసోః మాలిన్యం అశౌచం। శౌచంతు ద్వివిధం ప్రోక్తం బాహ్యాభ్యంతర ఏవచ। శరీర శుద్ధి, మనశ్శుద్ధి రెండూముఖ్యం. మట్టి, సీకాయ, కుంకుడుకాయ, సబ్బులు వీటిద్వారా మలమూత్రాదులు విడచునపుడు, స్నానాదులు చేయునపుడు శుద్ధి చేసుకోవలెను. శరీరముయొక్క నిజస్వరూపమేలాంటిది అనగా : – స్థానాద్బీజాదుపష్టంభాన్నిష్యందాన్నిధనాదపి” ।

కాయమాధేయశౌచత్వాత్పండితాహ్యశుచింవిదుః ॥

ఈ శ్లోకమున తెలిపిన 5 వికారముల చేతను శరీరాన్ని పండితులు అశుచియని చెప్పిరి. శరీరమునకుత్పత్తిస్థానమగు తల్లి గర్భకోశము దుర్గంధ వస్తు భరితమై అందుండి వెడలినది గావునను, మిక్కిలి మలినములగు తల్లిదండ్రుల శుక్లశోణితములే ఉపాదాన కారణము గావునను, అన్న పానాదులచే పరిపాకముగలిగి రక్తాది సప్తధాతువుల రూపమునొందిన రసముచే నిలువబడినదిగావునను, నవ ద్వారాములనుండి మలమూత్ర స్వేదాదులను గార్చుచుండునుగావునను, ప్రాణవియోగానంతరము స్పృశించుటకు భయము గలిగించునదియును, స్నానాదులు చేయకుండా ఏ పని చేయుటకు వీలుగానందునను. ఎప్పటికప్పుడు ప్రతి దినము స్నానాదులు చేయకుండిన దుర్గంధ పూరితమైన శరీరమునందు శుచియను బుద్ధియే అవిద్య అనబడును.

దుఃఖమునందు సుఖబుద్ధియు అవిద్యయనబడును. విషయభోగరూప దుఃఖమునందు సుఖ మనుజ్ఞానము గూడ అవిద్యయే. దుష్టానిఖానీంద్రియాణి అత్రేతి దుఃఖం. దుర్నిందితం ఖనతి వా దుఃఖం. ఖను–అవధారణే, సర్వేషాం ప్రతికూలతయా వేదనీయం దుఃఖం.

ఇంద్రియములకు శబ్దాది విషయములు ప్రతికూలమయినపుడు మనస్సునకు గలిగే క్షోభను దుఃఖమందురు. ''విషయేంద్రియ సంయోగాద్యత్తదగ్రే అమృతోపమమ్ । పరిణామే విషమివతత్సుఖం రాజసం స్మృతమ్" అని గీత 18:38. తేనె విషము కలసిన పదార్థం తినుటకు రుచికరముగా నుండినను, పరిణామములో అనంత దుఃఖమును గలిగించును. అనంతదుఃఖం అల్పసుఖమును గలిగించినది కావున విషయ భోగ రూప దుఃఖమునందు సుఖమను బుద్ధియు నవిద్యయే.

ఆత్మభిన్న వస్తువునే ఆత్మయనుకొను బుద్ధియు నవిద్యయే. పరిణామశీలముగలది, వినాశము గలది, ఉత్పత్తి గలది, షడ్ భావవికారము గల భోగాయతనమగు శరీరమునందు గాని, భోగోపకరణములగు మనస్సు మొదలగు ఇంద్రియాదులందు గాని నేను అనే ఆత్మబుద్ధిని అవిద్యయందురు. అనాత్మరూపమైన నామరూప జగత్తునందు, నేను నాదియనే ఆత్మబుద్ధి నుంచుట అవిద్య. వీటన్నిటికి సాక్షీభూతుడనై నాశము కాని స్వరూపముగలవాడను, నిత్యశుద్ధ బుద్ధ ముక్త స్వరూపుడను అనే విజ్ఞానము ద్వారా అజ్ఞానమును జయించినవాడే మోక్ష సామ్రాజ్యము నలంకరించి బ్రహ్మానందమును పొందును. **ఓం తత్సత్ ఓమ్**

"త్రినేత్ర వైద్యాలయ ట్రస్టు"కు ఈక్రింది వారు పైకం పంపినారు

(1).	చైతన్య ట్రస్టు (శ్రీకాళహస్తి)	–	రూ.19877–66
(2).	అత్యం వెంకటాచలం (పెనుగొండ, ప.గో)	–	రూ. 36789/-
(3).	ఎ.కస్తూరి, రిటైర్డ్ టీచర్ (అంగలూరు, గుడివాడ మండలం)	–	రూ.30,000–
(4).	జి.సాయిగణేష్, కేరాఫ్.జి.కృష్ణమూర్తి(పానగల్)	–	రూ.10,000/-
(5).	వి.శ్రీహరి (రామగిరి, నల్గొండ)	–	రూ.20,000/-
(6).	బి.సీతారామమూర్తి (మాధవధార, విశాఖపట్నం)	–	రూ. 22,232/-
(7).	టి.బుజ్జమ్మ.భర్త : సుందర రామిరెడ్డి (శ్రీకాళహస్తి)	–	రూ.50,000/-
(8).	గంగా వైష్ణవి, తండ్రి : గంగాప్రకాష్ (వర్నీ – నిజామాబాద్ జిల్లా)	–	రూ. 63,200/-
(9).	టి.బుజ్జమ్మ, (శ్రీకాళహస్తి)	–	రూ.50,000/-
(10).	వాకాటి ఆండాళ్, (భర్త, వాసుదేవరెడ్డి) (రావిగుంట పాళెం)	–	రూ. 40,000/-
(11).	అత్యం వెంకటాచలం (పెనుగొండ)	–	రూ.20,099/-

శ్రీ మలయాళస్వామి జీవిత విశేషాలు - 20
స్వీయ రచనలు

- డా॥ సముద్రాల లక్ష్మణయ్య, (తిరుపతి)

స్వామి మలయాళ దేశం నుండి వచ్చారు. తిరుమల గోగర్భంలో తపోనిష్ఠులయ్యారు. అక్కడి ప్రజలకు వారి ఊరు, పేరు తెలియవు. మలయాళ దేశీయులు కాబట్టి మలయాళస్వామి అని వ్యవహరించారు.

బాల్యంలో వారికి తల్లిదండ్రులు పెట్టిన పేరు వేలప్ప. 1936లో వారు సన్న్యాస స్వీకారం చేసినప్పుడు వారికి 'అసంగానందగిరి' అని గిరినామ సంప్రదాయానన్ననుసరించి నామకరణం చేయడమైనది. కాని ప్రజలు పెట్టిన 'మలయాళస్వామి, అను పేరే నేటికీ వారిపట్ల ప్రశస్తమయింది. కాని తక్కిన పేర్లు అందరికీ తెలియవు.

స్వామి తిరుమలలో ఉన్నప్పుడు క్రమంగా తెలుగులో మాట్లాడడానికి అలవాటు చేసుకొన్నారు. ఈ అలవాటు ఆపైన గ్రంథరచనకు దారిదీసింది. గోగర్భంలోనూ, వ్యాసాశ్రమంలోనూ వారు రచించిన గ్రంథాలు 57 ఉన్నాయి. వీటినన్నింటినీ క్రోడీకరించి పరిష్కరించి ఇంచుమించు పదివేల పుటలకు విస్తరించిన 20 సంపుటాలుగా 2001లో వ్యాసాశ్రమం తరపున ప్రచురించడమైనది. ఈ క్రోడీకరణ - పరిష్కరణ కార్యక్రమం గురుకృపవల్ల ఈ వ్యాసరచయితకే లభించింది. ఈ సంపుటాల ప్రచురణకు తిరుమల తిరుపతి దేవస్థానం ఆర్థిక సహాయం అందజేసింది.

స్వామి రచించిన రచనలలో 'శుష్క వేదాంత తమోభాస్కరం' అగ్రగణ్యమైనది. ఇది 1919లో గోగర్భంలోనే వ్రాయడమైనది. ధ్యానామృతం, యథార్థ భారతి (చిన్నపొత్తం). పూజా పంచరత్నమాల - అనే గ్రంథాలు గూడా గోగర్భమందే తయారయ్యాయి.

శుష్క వేదాంత తమోభాస్కరం ఆధ్యాత్మిక కృతులలో మిక్కిలి ప్రశస్తమైనది. ప్రజలలో ఆత్మజ్ఞానం పూర్తిగా లోపించి వుండడం, కొందరు సాధువులలో గూడ వైరాగ్య సదాచారాలు లోపించడం, మాంసభక్షణాది దురాచారాలు, జంతు బలులు మొదలగు అకృత్యాలు, స్త్రీలలో ముఖ్యంగా ఆధ్యాత్మిక విద్యా వికాసం లేకుండడం, ఏది చేసినా ఆత్మకంటదు అన్న పిడివాదంతో దుష్కృత్యాలకు అలవాటుపడడం -ఇలా సమాజం ధర్మదూరమై యున్న పరిస్థితులు గమనించి శ్రీస్వాములవారు ఈ పరిస్థితులను చక్కదిద్దడానికై 'శుష్క వేదాంత తమోభాస్కరం' రచించారు.

ఈ గ్రంథాన్ని మద్రాసులోని ఒక ముద్రణాలయం వారు మొదట ప్రచురించారు. తరువాత నేటి వరకు పలుసార్లు ముద్రింపబడింది. ఈ గ్రంథం శ్రీ స్వాములవారి యశోవ్యాప్తికి గూడా ముఖ్యకారణమయింది. ఆ రోజుల్లో తిరుమలకు వచ్చే యాత్రికులు ఈ గ్రంథం తీసుకొని చదివేవారు.

జీవకారుణ్యం, ఇంద్రియ నిగ్రహం, ఏకాంతనివాసం - ఇత్యాది గుణాల గొప్పతనం నిరూపించడానికీ, ద్విజేతరులు, స్త్రీలు గూడా జిజ్ఞాస కల్గితే బ్రహ్మవిద్య నభ్యసించవచ్చు అని తెలియపరచడానికీ, ఈ గ్రంథం రచించడమైనది. మొదట ఈ గ్రంథాన్ని ఎవరైనా ముద్రించుకోవచ్చు అని గూడా ప్రకటించడం వల్ల ఇది విస్తృత వ్యాప్తి పొందింది.

ఇందలి విప్లవాత్మక భావాలపై శ్రీనారాయణ గురు ప్రభావం గూడా ఉండినది.

ఇందులో సూత్రప్రాయంగా వ్రాసిన విషయాలు తరువాత రచించిన గ్రంథాలలో విపులంగా నిరూపించడం జరిగింది. యథార్థ భారతి మాస పత్రిక ప్రారంభమైన తరువాత శ్రీవారి వ్యాసాలు అందులో క్రమంగా ప్రచురింపబడేవి. అవి తరువాత గ్రంథరూపం పొందాయి. శ్రీస్వాములవారి ప్రసంగాలను భక్తి శ్రద్ధలతో ఆలకించిన భక్తులు కొందరు వాటిని గ్రంథస్థం చేశారు.

గీతా ప్రచారం ముఖ్యమని భావించిన శ్రీవారు స్వయంగా గీతకు వ్యాఖ్యానం రచించారు. మూలం గీత, స్థూలాక్షర గీత, తాత్పర్య గీత, మహాభగవద్గీత, శంకరానందీయగీత –ఇలా గీతపైననే ఎన్నో విశిష్ట గ్రంథాలు ఆశ్రమంలో ప్రచురణ పొందాయి.

శ్రీవారి జీవితమే భగవద్గీతకు భాష్యప్రాయమని శ్రీశివానంద స్వాములవారన్నారు. శ్రీ విద్యాప్రకాశానందస్వామి వంటి స్వామి శిష్యులు స్వయంగా ఆశ్రమాలు స్థాపించి అనేక గ్రంథాలు వ్రాసి ప్రచురించారు. శ్రీ విద్యాప్రకాశానందుల గీతామకరందం సుప్రసిద్ధం కదా! ఇలా శ్రీ మలయాళస్వాములవారు స్వీయ రచనల ద్వారా ఆంధ్రావనిలో ఆధ్యాత్మిక రంగంలో అపూర్వ విప్లవం కల్గించారు.

సద్గురు సర్వ సేవా ట్రస్టుకు ఈ క్రింది వారు పైకం పంపినారు

1). శ్రీమతి ఎ.కస్తూరి, రిటైర్డ్ టీచర్, – రూ.20,000/-
(అంగలూరు, గుడివాడ మండలం)

2). శ్రీమతి సి.నీరజాక్షి, భర్త:జగదీశ్వరరావు,శ్రీకాళహస్తి –10,000/-

జ్ఞాన సుధ

మూలం
శ్రీ సర్వభూషణ శివయోగి వారు

అనువాదం :
శ్రీ శంకరానందగిరి స్వాములవారు
(ఉమామహేశ్వర పీఠాధిపతులు)

అవ : 'సర్వం ఖల్విదం బ్రహ్మ' యను జ్ఞాననిష్ఠకు ఉపాసనా కర్తవ్యత లేదని రెండు శ్లోకముల ద్వారా తెలుపుచున్నారు–

భానా ద్బ్రహ్మమయే ఽ ఖిల
విశ్వే కాలస్థలోపకరణదిశామ్,
మమ తారతమ్య మవిదః
క్వార్చా క్వాహం క్వ వా దైవమ్ ॥౪॥

భానాత్ = జ్ఞానము వలన, అఖిల విశ్వే = సమస్త జగత్తు, బ్రహ్మ మయే సతి = బ్రహ్మమయమై యుండగా, కాల = త్రికాలములు, స్థల = పవిత్ర అపవిత్ర స్థానములు, ఉపకరణ = వస్తువులు, సాధన సామగ్రి, దిశాం=పూర్వాది దిక్కులు అను వీని, తారతమ్యం = తేడా, అవిదః = తెలియకున్న, మమ = నాకు, అర్చా= పూజ, క్వ = ఎక్కడ? అహం = నేను, క్వ= ఎక్కడ, దైవం వా = దేవత గాని, క్వ = ఎక్కడ?

జ్ఞానమయీ దృష్టిచేత సమస్త ప్రపంచము బ్రహ్మమాత్రమేయై ఉండి పోవుచుండగా ప్రాతర్మధ్యాహ్న సాయంకాలాదులు గాని, శివాలయాది నదీతీరాది పవిత్ర స్థలములు గాని, అశౌచగృహాది అపవిత్ర స్థలములుగాని వీని తారతమ్యము గాని భాసింపని స్థితియందు ఉపాసకుడెక్కడ ఉన్నాడు? ఉపాసన యెక్కడిది? ఉపాస్య దేవత యెక్కడిది? ఔరా! ఇట్టిది గదా బ్రాహ్మీస్థితి. దిగ్దేశకాలములు భాసింపని యాస్థితిగల అమ్మహాత్మునిచేత ఈ సమస్త పృథ్వి పవిత్రమగుచున్నది. వానికి విధి ఎక్కడిది? నిషేధమెక్కడిది? పూజింపబడెడు దేవతలున్ను వానిని పూజింపవలసినదే!

మూలం: శ్రీ వ్యాసమహర్షి

ఉద్ధవ గీత

అనువాదం: యేలేశ్వరపు_హనుమరామకృష్ణ

సత్సంగము

శ్రీకృష్ణ భగవానుడు : ఓ ఉద్ధవా! ఈ సందర్భంలో మరొక ముఖ్యమైన విషయం కూడా నీకు సూచిస్తున్నాను. నేను సత్పురుషులచే సదా సమాకర్షుడను ! వారున్న చోట నేను శంఖ –చక్ర– గదా–పద్మధారుడనై చతుర్భుజాలంకారుడనై ప్రియభావంతో వేంచేసి ఉంటాను. అందుచేత, సత్పురుషులు శాశ్వతానందప్రదమగు ఆత్మతత్త్వమును సంభాషించుకునే చోట నేను శాంత – ఆనంద–జగద్రక్షక విశేషరూపంతో నాకు నేనే (నన్ను వేరుగా / ప్రత్యేకంగా ఆహ్వానించకుండానే) వచ్చి వుంటాను !.

– శ్రీ మాతా గురుచరణానంద

అట్టి మహనీయుల అమృత వాక్కులు ప్రవచనమగుచున్నచోటు అతి పవిత్రమైనది. సంత్సంగము అని చెప్పబడే వారి ఆత్మజ్ఞాన – ఆప్త వాక్యములు పరస్పర సంవాదములు, గురు–శిష్య బోధలు అమోఘమైన ప్రభావం కలిగి ఉంటాయి.

నా మహిమ శ్రేయోదాయకమై అక్కడివారి వెంటనంటి వుంటుంది. సత్సంగం చేత భక్తి– జ్ఞానములు ప్రవృద్ధమైనట్లుగా మరొక ఉపాయం చేత ప్రవృద్ధం కాదని అందరికీ మనవి చేస్తున్నాను.

ఓ యదునందనా! ఉద్ధవా! నీవు నాకు భృత్యభావంతో సేవిస్తున్నవాడివి! స్నేహితుడివి! భక్తి –ప్రపత్తులు కలవాడివి! అందుచేత నీపై నాకు ఉన్న అవ్యాజమైన ప్రేమచే... ఇప్పుడు

సాధుసాంగత్య మహిమ – గురించి విను !

ప్రాపంచికమైన సాధారణ మమకారములను పరమాత్మ వైపుగా నడిపించటం వలన ప్రాప్తించగల సర్వోత్కృష్టమైన ఫలితాల గురించి కూడా కొన్ని గూఢమైన రహస్యాలు చెప్పుబోవుచున్నాను !శ్రద్ధగా విను.....

సత్సంగ మహిమ

ఓ ఉద్ధవా ! నా యొక్క పరతత్వం నీ వశం చేసుకోవటానికి అనేక అనేక ఉపాయాలు ఉన్నాయి. మార్గాలు ఉన్నాయి.

విచారణా మార్గం (లేక సాంఖ్య మార్గము) : "ఇది దేహము – ఇది ఆలోచనారూపమైన మనస్సు – ఇది విమర్శన –విచక్షణ – విచారణ– వివేచనా రూపమైన బుద్ధి – ఇది ఇష్టము అనురూపమంగా ప్రదర్శితమగుచున్న చిత్తము – ఇది అహంకారము– ఇది జీవుడు – ఇది తత్‌సాక్షి అయిన ఆత్మ ... ఇది సర్వజీవులలోని సాక్షి – అట్టి కేవల సాక్షి –సర్వుల రూపము!" నేనే ఇట్టి విభాగ పాండిత్య అంతర్యామి, –పరిశీలనా – పరిచింతనా– పరియోచనా యోగం!

ధర్మ మార్గం : పరమాత్మకు అనుకూలమైన ప్రార్థన– ఆలాపన – సహజీవుల పట్ల దయ.... మొదలైనవి. నియమిత కర్మలు – ధర్మములు (The Duties and functions expected of you by the Society) ఉపాసనా పూర్వకంగా నిర్వర్తించటం.

స్వాధ్యాయ యోగం (లేక మార్గము): భగవంతునికి సంబంధించిన పాఠ్యాంశాలు – వేద వాక్కులు మరలమరల పఠించటం. (Chanting and singing individually or in a group).

ఇష్టాయోగం (లేక మార్గము) : భగవంతునికి ఉపాసించే విధంగా వ్రతాలు – యాగాలు– యజ్ఞాలు – పూజలు మొదలైనవి నిర్వర్తించి పరమాత్మకు ప్రియం కావటం!. (The acts of Adoration)

పూర్తయోగం (లేక మార్గము): లోక ప్రయోజన కారకములైన నూతులు త్రవ్వించటం, దేవాలయాలు కట్టించటం, బాటలు నిర్మించటం మొదలైన నలుగురికి పనికివచ్చే ఆయా శోభప్రదమైన కార్యక్రమములు నిర్వర్తించటం. (Acts that carry good to others) .

వ్రతనియమ యోగం (లేక మార్గము) : ఇంద్రియనిగ్రహం కొరకై వ్రతములు

– ఉపోషముల వంటి ఇంద్రియ నియమములు నిర్వర్తించటం.

దక్షిణవ్రత యోగం : తనకున్న సంపద పరులకు సమర్పించటం. ఇతరులతో పంచుకోవటం. పేదవారిని దాన–దక్షిణలతో తృప్తిపరచటం!. (అంగసంబంధమైన శాస్త్రీయ ఉపాసనములు కూడా ఇందులోకి వస్తాయి)

ఛందోవ్రత యోగం (లేక మార్గము) : భాషాయుక్తమైన భగవత్ స్తోత్రాలు పురాణాలు, వేదమంత్రాలు చదవటం, వ్రాయటం, వ్యాఖ్యాన గ్రంథాలు రచించటం మొదలైనవి.

తీర్థయోగం : తీర్థ ప్రదేశాలు సందర్శించి ఆయా భగవత్ స్థానములను నమస్కార –ప్రదక్షణల పూర్వకంగా ఉపాసించటం.

యమ నియమ యోగం : ఇంద్రియములను అదుపులో పెట్టి వైదిక –ధ్యాన యోగాది మార్గాలలో నియమించటం.

ఇక సత్సంగము గురించి.... : ఇవన్నీ గొప్ప మార్గాలే! అయితే, సంత్సంగము అన్నిటికన్నా సులభము – మహత్తరము అయిన మార్గము సుమా! సత్సంగముతో మరేవీ సాటిరావు – అని నాఅభిప్రాయం!

సత్సంగము అనే సాధనా యోగం కేవలం మానవులకే పరిమితమనుకోకు. అది దేవతలు–రాక్షసులు–పక్షులు– మృగములు–నాగులు–మొదలైన వారంతా ఆచరణలో పెట్టుచున్నదే!

ప్రతి యుగంలోను సత్సంగ ప్రభావం చేత అనేకులు పరమాత్మనగు మత్–పదమును జేరుచున్నారు.! సాత్వికులైన దేవతలే కాదు! రజోతమోగుణ సంపన్నులైన మానవులు, దైత్యులు, మృగములు, పక్షులు, గంధర్వులు, అప్సరసలు, నాగులు, సిద్ధులు, చారణులు, గుహ్యకులు, విద్యాధరులు, సిద్ధులు, సాధ్యులు, వైశ్యులు, శూద్రులు, స్త్రీ స్వభావులు, అంత్యజులు, ఇతర రజోగుణ స్వభావులు, తమోగుణ, స్వభావులు...వీరంతా కూడా యుగయుగాలుగా అనేకానేకులు సత్సంగ ప్రభావంచేత జీవాత్మ పరిమితత్వమును అధిగమించి పరమాత్మత్వమును సముపార్జించుకుంటున్నారు!. అసుర –దానవ జాతులలో వృత్రాసురుడు,

ప్రహ్లాదుడు, వృషపర్వుడు, బలి,విభీషణుడు, బాణుడు, మయుడు...., అట్లాగే జంతుజాతులలో సుగ్రీవుడు, హనుమంతుడు, జాంబవంతుడు, గజేంద్రుడు, జటాయువు, తులాధారుడు, వణిజుడు..., ఇదేవిధంగా ధర్మవ్యాధుడు, కుబ్జ, వ్రజగోపికలు, యజ్ఞానుష్ఠానపరులగు కొందరి భార్యలగు యజ్ఞపత్నులు... వీరంతా కూడా శ్రవణంచేత వింటున్న ఆత్మవిద్య యొక్క మననం చేత సత్సంగ ప్రయోజనంగా అస్మత్‌పదమును సులభంగా పొందటం జరిగిందయ్యా! వారిలో అనేకులు శ్రుతుల (వేదముల)ను నేర్వలేదు! మహనీయులగు వారికి శిష్యత్వము–ఉపాసనత్వము నిర్వర్తించనూ లేదు! వారంతా కేవలం సత్సంగ ప్రభావం చేత నన్ను అతి తేలికగా పొందటం జరిగింది! జరుగుతోంది! జరుగగలదు!

పరమాత్మతో అనన్యత్వం సంపాదించటానికి సత్సంగము కేవలం మానవులే కాదు! వృక్షములు – జంతువులు – కొండలు కూడా మహత్తత్వము సముపార్జించుకోగలవు సుమా! సత్సంగమువలన కలిగిన అనన్య భావం తత్త్వ శాస్త్ర శ్రవణం (త్వమ్ తత్ అసి అని నిరూపించే శాస్త్రీయ ప్రవచన శ్రవణం) చేత వ్రజ గోపికలు, వ్రజములోని ఆవులు, అనేక వృక్షములు, నాగులు, ఇతర మూఢ గతిని అనుభవిస్తున్న కీటకము వంటి జీవులు సముద్ధరించబడ్డారు. వీరంతా కూడా–నేను కృష్ణ చైతన్యమే! నేనే ఈ సర్వ జగత్ రూపంగా విస్తరించి నాకు అగుపిస్తున్నాను. ఈ జగత్తులు నాలో ఉన్నాయి కాని, నేను ఈజగత్తులో లేను... అనురూపమైన కేవలీ ద్రష్టత్వ పరతత్వాన్ని ఆస్వాదించారు!

జీవుడా! మేలుకో!!

శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు

ఓ ఉద్ధవా ! సంత్సంగమును ఆశ్రయించకుండా, యోగ–సాంఖ్య –దాన–వ్రత– తపో – వ్యాఖ్యాన పాండిత్యము – స్వాధ్యాయనము –సన్యాసము మొదలైన అనేక రీతులుగా కూడా నన్ను అంత సులభంగా పొందలేరని మరొక్కసారి గుర్తు చేస్తున్నాను!. నా అభిప్రాయము చేతులెత్తి ప్రకటిస్తున్నాను. (ఊర్ధ్వ బాహుర్విరేమ్యేష!).

అమర నారేయణ సందేశం

- ఆచార్య కె. సర్వోత్తమరావు, (తిరుపతి)

తెలుగువారికి 'వీరబ్రహ్మ' గురించి తెలుసు. వీరబ్రహ్మం గారిలాగే యోగవిద్యకు ప్రాధాన్య మిచ్చి తెలుగు, కన్నడభాషలలో ఎన్నో కీర్తనలు పాడినవాడు అమర నారేయణ. ఇతనిది కోలారు జిల్లా 'కైవారం'. వృత్తి గాజులమ్మకం. సంసారాన్ని రోసి పరదేశస్వాముల వారి ఉపదేశంతో యోగమార్గాన పయనించిన రాజయోగి. తన జీవిత కాలంలో ఎన్నో మహిమలను ప్రదర్శించిన సిద్ధయోగి. ఆ వాగ్గేయకారుడు ప్రజానీకానికి ఎన్నో సందేశాలిచ్చాడు. వాటిలో కొన్నింటిని పరిచయం చేయడమే ఈ వ్యాస ప్రధానోద్దేశం.

అమర నారేయణుల దృష్టిలో సర్వశ్రేష్ఠం. "చచ్చిపుట్టని విద్య" ఈ విద్య నేర్పేవాడే అసలు గురువు. ఆ విద్య యోగం వల్లే సాధ్యం.

పొందుగా పరదేశ పట్టణంబున వున్న
శృంగారవతి శ్రీ మోక్షకాంతకు
మానసంబున మంచి మౌక్తిక హారము వేసి
అనుకూలమైయ్యేది అది రాజయోగం (కీ 12)
యోగి గుణములు రాజ యోగికి తెలుసు
యితరులకు అతని గుణమది యట్ల తెలుసూ (కీ 106)

యోగి నిర్భయుడు. అతడు ఏనుగు ఎక్కిన వానితో సమానుడు. అతనిని చూచి కుక్కలు మొరిగితే ఫలమేమిటని అమర నారేయణుని ప్రశ్న.

అమర నారేయణ మొదట విరుచుకు పడ్డది కుహనా గురువులపైన.

బిత్తారి గురువూలు బెత్తాలు బట్టాక
కట్యాల మీదాను నడిచేరురా
పట్టి చెప్పేనంటె గుట్టెల్ల బయలై
నిష్ఠాలన్ని యేడి పాలవును రా (కీ 26)

ఆలాగే మరో చోట

మాయ వాదమున మనుజులు కొందరు
యోగుల మనుచు తిరిగేరూ
అంతర్యామిని చూడని యోగులనేక
జన్మము లెత్తేరూ (కీ 84) అని నిందించాడు.

లోకంలో 'నకిలీ' అన్ని రంగాలలోనూ ఆధిపత్యం చెలాయిస్తూ వుంది. అలాగే యోగులలోనూ అసలు యోగులు తక్కువని అమర నారేయణుల అభిప్రాయం. అందుకే,

పూసలు మెడ కొన్ని వేసి
బెత్తపు కీలు చేతబట్టుక
పాటాలు పాడుచు ఇల్లిల్లు తిరిగే
హీన జాతి వారిని
తోయము తులిశాకు చేతిలో పడవైచి
ముందర మీకిది ముక్తి మార్గమనుచు
పసలేని మంత్రము వుపదేశము చేసి
దబ్బరతాకోట్ల దొంగచార్యులను
హృదయ లింగము వుండే వునికి తెలియలే

శివ శివ కోరణ్య భిక్షజంగాలను, విజాతి సన్యాసులను బ్రహ్మను తెలుసుకొనేవారిని తూర్పారబట్టాడు.

ఊరూరు తిరుగన్యాలె నీకు యిది బుద్ధి కాదు చాలే

నీలోవుండే నిక్షేప మెరుగకును నీచుడై తిరుగ తగునా ! అన్నదే అమర నారేయణుల సద్బోధ.

అమర నారేయణులు 'సంసారులకు' కూడా ఎన్నో సందేశాలిచ్చాడు. ఆ సందేశాలన్నీ అతని అనుభవంలోనివే. మొదటిది.

అప్పు శాయగరాదు అది మేలు కాదు
సుజ్ఞానులకు ముప్పు క్షుద్రులకు మెప్పు 83

అప్పు చేసిన వారి అగచాట్లను అద్భుతంగా వర్ణించాడీయోగి. పెద్దా చిన్నా అనక తిట్టేది. పనులు లేకున్నా పొరుగిండ్లకు వెళ్ళేది. మగని మాటలను తప్పుపట్టేది. పతివ్రతలపై నింద వేసేది. ఎన్నాళ్ళు ఈ కొంప కోసం ఏడవడమని విసుగు ప్రకటించేది. ఇంటి గుట్టును ఇతరులకు చెప్పేది. నీవూ మగవాడివా అని మగని హేళనగా చూచేది. కన్నబిడ్డలను కసిరేది. దుర్జనులకు వీలుగా వకాలతు పలికేది. 'అయిన పెండ్లామును విడవలెను' అంటూ విడువకుండిన బ్రదుకు విఫలమై చెడును అని చెప్పిన అంశాలన్నీ ఆలోచించదగ్గవే.

అన్నిటికన్నా మించి అమర నారేయణ జాతులను, జాతి వివక్షను విమర్శించాడు.

జగక్కె కులవిల్లా లింగక్కె హోలె ఇల్ల (కీ 26)
(లోకులకు కులం లేదు, లోకానికీ లేదు. లింగానికి ప్రాదేశిక ఆంక్ష లేదు)
నడెనుడిగె నరహరియ నామ జపిసిలిబేకు
జాతి జన్మగ ళొందు సమకూడబేకు (కీ 51)
(జాతీ జన్మలు రెండూ ఏకం కావాలి)
కులమూలాన్నిటికి మేటీ
కులము వాడొక డున్నాడు

వానికులమేది వెదకి చెప్పరా ఓ శిష్యాగ్రతనయా (కీ 104)
కులమంటే దైవకులమొక్కటే దైవమే సకల
జీవరాశికి కర్త. కనుక అందరు ఒకే కులమని
అమర నారేయణ భావన.
మా జాతి హెచ్చనుచు మీ జాతి పిచ్చనుచు
తర్క వాదము శాయతగదు మీకు (కీ 31)
అవి యోగి ఉద్బోధ
జాతులన్నియు వేరె జన్మాదులు వగటె
జనులాకు సంశయ మేల పరాకు (కీ 140)
అని హెచ్చరిక.
ఏ జాతివారమో యెరుగలేమయ్యా
స్త్రీ పురుష జాతులని సృష్టిలో రెండూ (కీ 31)
అని అమర నారేయణుల నిర్ణయం.
కులము విడచీనారము యే
కులములోన కలియామూ
కులగోత్రముల కూలవేశి
కుధరమెక్కి నారమూ కీ 33

యోగులు కులాతీతులు. పురందర దాసులవారు జ్ఞాని గళిగె కులవిల్ల, జ్ఞానులకు కులం లేదన్నారు.
చాటీ చెప్పితి మోక్ష సాధకులైతేను
ఏ జాతివారైన మా జాతిరా (కీ 25)
అన్నదే అమర నారేయణుల తుది నిర్ణయం.

ఇవేగాక క్షుద్ర దేవతారాధనలను, సక్రమ మార్గం ఎన్నుకోని వ్యక్తుల ప్రవర్తనలను అమర నారేయణ నిందించాడు. అతనిది అమర సందేశం. ఆచరణీయ సందేశం. ఆదర్శ సందేశం.

ఆంధ్ర మహాభాగవతము

- డాక్టర్ ఆచార్య జక్కంపూడి మునిరత్నం (తిరుపతి)

(గత సంచిక తరువాయి)

20. రామావతారం : దశరథుడు సంతానం కోసం పుత్రకామేష్టి చేశాడు. విష్ణువు కౌసల్యా దశరథులకు రాముడుగా జన్మించాడు. లక్ష్మణుడు, భరతుడు, శత్రుఘ్నుడు ఆయనకు తమ్ముళ్ళు.

రాముడు శివ ధనుర్భంగం చేసి సీతను పెళ్ళాడాడు. తండ్రి మాటకోసం వనవాస నిమిత్తం దండకారణ్యంలో ప్రవేశించాడు. భయంకరమైన వాడి బాణాలతో ఖరదానవుణ్ణి కడతేర్చాడు. సుగ్రీవుణ్ణి పరిచరుడుగా స్వీకరించాడు. అతని అన్న వాలిని హతమార్చాడు. సుగ్రీవుడి భార్య రుమను, వానర రాజ్యమైన కిష్కిందను సుగ్రీవుడికి దక్కేట్టు చేశాడు.

రాముడు త్రిలోక విరోధి అయిన రావణాసురుణ్ణి హతమార్చాలను కున్నాడు. వానర సైన్యాన్ని వెంటబెట్టుకొని లంకవైపుకు దారితీశాడు. సముద్రమడ్డుపడింది. రాముడు కన్నెర్ర చేసేసరికి సముద్రం తుకతుకా ఉడికి ఎండిపోయింది. సముద్రుడు రాముణ్ణి శరణుజొచ్చాడు. మునుపటి లాగే ఉండమని రాముడు అతనిని అనుగ్రహించాడు. నలుడనే వానర ప్రముఖుడిచేత వంతెన కట్టించి రాముడు సముద్రం దాటాడు. రావణుణ్ణి హతమార్చి అతని తమ్ముడైన విభీషణుణ్ణి లంకకు రాజుగా చేశాడు. ఆ దశరథరాముణ్ణి కీర్తించడానికి లోకంలో ఎవ్వరికీ సాధ్యం కాదంటే నమ్ము.

21. కృష్ణావతారం : నారద మునీంద్రా ! పూర్వం ఒకప్పుడు రాక్షసాంశలతో రాజులనేకులు జన్మించారు. వారికి గొప్ప సైన్యం ఉండేది. ఆ సైన్యబలంతో కన్నుమిన్ను తెలియక అధర్మ మార్గంలో ప్రవర్తించారు. భూదేవికి బాధ

కలిగించారు. ఆమె ఆ బాధలను భరించలేక విష్ణువుతో మొరపెట్టుకొంది.

విష్ణువు భూభారాన్ని తొలగించాలనుకున్నాడు. అలా తొలగించేందుకు తన రెండు వెంట్రుకలే చాలనుకున్నాడు. యదువంశానికి చెందిన వసుదేవుడి భార్య రోహిణికి తన తెల్లని వెంట్రుకతో బలరాముడుగాను, మరో భార్య దేవకికి నల్ల వెంట్రుకతో కృష్ణుడుగాను ఇంచుమించు ఏకకాలంలోనే జన్మించాడు. వారిలో శ్రీకృష్ణుడు మానవాతీత కార్యాలెన్నో చేశాడు. అందువల్ల పరమేశ్వరుడు గానే పరిగణింపబడ్డాడు. ఆ కృష్ణుడు చేసిన పనులను చెప్పడం ఎవ్వరికీ సాధ్యం కాదు. నాకు తోచిన మేరకు చెబుతా జాగ్రత్తగా విను.

కృష్ణుడికి పురుడు తీరకముందే పూతన అనే రాక్షసి వచ్చింది. కృష్ణుణ్ణి హతమార్చే ఉద్దేశంతో తన స్తనాలకు విషం పూసుకొని మరీ వచ్చింది. బిడ్డకు పాలు ఇవ్వజూపింది, కృష్ణుడు ఆమె పాలతోబాటు ప్రాణాలను కూడా హరించి వేశాడు.

మూడు నెలల ప్రాయంలోనే కృష్ణుణ్ణి పరిమార్చేందుకు ఒక రాక్షసుడు వచ్చాడు. బండిరూపంలో వచ్చాడు. అందువల్ల వాడు శకటాసురుడనే పేరుతో వ్యవహరింపబడ్డాడు. కృష్ణుడు ఒక కాలి తన్నుతో ఆ రాక్షసుణ్ణి యమపురికి పంపాడు.

కృష్ణుడి అల్లరి పెరిగింది. రేపల్లె వాడలోని గోపికలు వచ్చి తల్లి యశోదకు మొరపెట్టుకున్నారు. ఆమె అతన్ని ఒక రోటికి కట్టివేసింది. కృష్ణుడు ఆ రోలీడ్చుకుంటూ వెళ్ళి ఆకాశమంత ఎత్తుగా ఉన్న మద్ది మాకులకు తగిలించి నేలకూల్చాడు. రేపల్లె జనుల ప్రశంసలందుకున్నాడు. కృష్ణుడు తన నోటిలోనే చరాచర ప్రపంచాన్ని తల్లి యశోదకు చూపాడు. అమ్మ ఆశ్చర్యానికి అవధులు లేకపోయాయి.

యమునా నది మడుగులో కాళీయుడనే సర్పరాజు నివసించేవాడు. అతని నాలుకల్లో విషముండేది. ఆ విషం మడుగు నీటిలో కలిసిపోయేది. ఆ నీరు త్రాగిన జంతువులు, జనము ప్రాణాలు కోల్పోయేవారు. కృష్ణుడీ దుస్థితిని పోగొట్టాలనుకున్నాడు. ఆ సర్పరాజు బలాన్ని క్షీణింపజేసి మడుగు నుంచి వెళ్ళగొట్టాడు. గోవులు, గోపాలురు కూడా తేలికగా ఊపిరి పీల్చుకున్నారు.

ఒకరోజు రాత్రి గోప, గోపీ జనమంతా గాఢనిద్రలో ఉన్నారు. ఆ సమయములో కార్చిచ్చు వారిని చుట్టుముట్టింది. వారంతా లేచి హాహాకారాలు చేశారు. తమను రక్షింపుమని కృష్ణుణ్ణి వేడుకున్నారు. కృష్ణుడు వారికి అభయమిచ్చాడు. వారిని కళ్ళు మూసుకోమన్నాడు. అలవోకగా ఆ దావానలాన్ని కబళించి వేశాడు.

ఒకరోజు అర్ధరాత్రి నందుడు హడావిడిగా యమునా నదికి వెళ్ళాడు. స్నానానికి ఉపక్రమించాడు. నదిలో మునిగిపోయాడు. వరుణపాశాల్లో తగులుకున్నాడు. కృష్ణుడు ఆ విషయాన్ని పసిగట్టి వెంటనే అక్కడికి వెళ్ళాడు. వరుణ పాశాల నుంచి నందుణ్ణి విడిపించి ఇంటికి తీసుకు వచ్చాడు. రాక్షసుల శిల్పి మయుడు. అతని కుమారుడు వ్యోమాసురుడు. అతడు తన మాయతో గోపాలురందరినీ ఒక గుహలో బంధించాడు. వారెవ్వరూ వెలుపలికి రాకుండా గుహను బండతో మూశాడు. కృష్ణుడు యుద్ధంలో ఆ వ్యోమాసురుణ్ణి హతమార్చాడు. యాదవ బాలకులందరినీ కాపాడాడు.

రేపల్లె వాసులు ప్రతియేడూ ఇంద్రయాగం చేసేవారు. కృష్ణుడి సూచన మేరకు దాన్ని మానివేశారు. ఇంద్రుడికి కోపం వచ్చింది. ఎడతెరపి లేకుండా వర్షించమని మేఘాలను పంపాడు. కుండపోతగా రాళ్ళ వాన

కురియసాగింది. గోకులమంతా వ్యాకులమయిపోయింది. రేపల్లె వాసులంతా కృష్ణుడితో మొరపెట్టుకున్నారు. ఏడేండ్ల బాలుడైన కృష్ణుడు గోవర్ధనగిరిని పైకెత్తి గొడుగులాగా ఏడు రోజులపాటు పట్టుకొన్నాడు. తద్వారా గోవులకూ, గోపాలకులకూ ప్రాణరక్షణ కలిగించాడు.

ఒక శరద్రాత్రి వేళ కృష్ణుడు వేణుగానం చేశాడు. అనేక రాగాలను ఆలపించాడు. మంద్రస్థాయినీ, మధ్యమస్థాయినీ, తారా స్థాయినీ వినిపించాడు. దైవతం, ఋషభం, గాంధారం, నిషాదం, పంచమం, షడ్జం, మధ్యమం అనేక స్వరాలు, కళలూ, జాతులూ, ఆరోహణావరోహణ క్రమాలు తేటపడేటట్టు చేశాడు. ఆ గాన మాధుర్యానికి ముగ్ధులై గోపికలు ఇండ్లు వెడలి వచ్చారు. ఇంతలో శంఖచూడుడనే కుబేరానుచరుడు అక్కడికి వచ్చాడు. గోపికలను బలవంతంగా ఎత్తుకుని పోసాగాడు. ఆ స్త్రీలు కృష్ణుణ్ణి బిగ్గరగా పిలుస్తూ ఆక్రందించారు. కృష్ణుడు వెంటనే వెళ్ళి శంఖచూడుణ్ణి మట్టి కరిపించాడు. గోపికలను విడిపించి తీసుకవచ్చాడు.

ఆ కృష్ణ పరమాత్ముడు నరకాసురుడు, మురాసురుడు, ప్రలంబుడు, కాలయవనుడు, కువలయాపీడము అనే ఏనుగు, ముష్టికుడు, చాణూరుడు మొదలైన మల్లులను, కంసుడు, శంబరుడు, శిశుపాలుడు, పౌండ్రక వాసుదేవుడు, పల్వలుడు,గార్ధభాసురుడు,సాల్వుడు,వత్సాసురుడు, బకాసురుడు, విదూరథుడు, రుక్మి, కేశి, దర్దురుడు, వృషభాకారాలు గల ఏడుగురు రాక్షసులు, దేవకుడు మొదలైన చాలామందిని రూపుమాపాడు. బలరాముడు, భీముడు, అర్జునుడు మొదలైన విలుకాండ్ర రూపాలను ధరించి దుర్మార్గులైన రాజులను తుదముట్టించాడు. సమస్త భూభారాన్ని తొలగించాడు. సజ్జనులను రక్షించాడు. అనంతుడైన ఆ కృష్ణుణ్ణి అనవరతమూ నేను ఆరాధిస్తాను.

ఎవ్వరితో విరోధం ? ఎందుకు విరోధం ?

– డా ॥ పులివర్తి కృష్ణమూర్తి

భగవానుని పవిత్ర నామగుణాదులను స్మరిస్తూ, కీర్తిస్తూ వుండటం వలన మానవుడి కలుషిత హృదయం పవిత్రతను సంతరించుకుంటుంది. శిశు హృదయంలాగా నిష్కల్మషంగా ఎంతో సరళంగా కాగలదు. భగవన్నామ కీర్తనం అనేది మనోగతములైన సమస్త మాలిన్యాలనూ కడిగి వేస్తుంది. భగవంతుని పట్ల కలిగిన ప్రేమావేశం కారణంగా శుద్ధము, శాంతిమయమైన భావాలు ఉదయించి మానవుని జన్మనూ, జీవితాన్నీ ధన్యము గావిస్తుంది. భక్తి వలననే రసమయ స్వరూపుడైన భగవంతుడి దర్శనం లభిస్తుంది. ఋషులకు కూడా దుర్లభమైన పరమానందం కలుగుతుంది. ఇక లౌకిక ప్రపంచంలో బ్రతుకుతూ కర్మలను ఆచరించేవారికి చెప్పవల్సింది కేవలం ఒక్కటే. భగవానుడి నుద్దేశించి నిష్కామ కర్మను చేయాలనే ఆదేశింపబడింది. అన్ని విధాలా కర్మ పరిత్యాగము గావించిన భక్తుడు కూడా భగవంతుడి ప్రేమ సాగరంలో మునిగి భగవచ్చింతనా రూపమైన కర్మను విడిచి పెట్టడం కుదరదు. కర్మము అనేది భక్తికి అనుకూలమైనదిగా మాత్రమే వుండాలి. శుష్క జ్ఞానమునకు ఇక్కడ ఏ మాత్రమూ తావు లేదు. ఎల్లరకూ భక్తి పథమే శరణ్యమని భావించవల్సి వుంది. సూర్యభగవానుడు, ప్రతి దినమూ ఉదయించుటా, అస్తమించుటా జరుగుతూనే వుంది. ప్రతి ఉదయాస్తమయములందుకూడా మానవుడి ఆయువు ఊరకే చెల్లిపోతూ వుంటుంది. మీ ప్రమేయం లేకుండానే అది జరిగిపోతుంది. భగవంతుని గురించిన ఆలోచనకై వినియోగించిన సమయమే సఫలమవుతుంది. ఇక లోకంలో మానవులు అన్నపానాదులూ రోజువారీ కర్మల

నాచరించడం గొప్ప విశేషమేమీ కాదు. మానవుల్లాగానే వృక్షాలూ, లతలూ జీవించడం లేదా? కమ్మరి వాని వద్ద వుండే తోలుతిత్తి మానవుడి లాగానే శ్వాసను గ్రహిస్తూనే వుంది కదా. పశువులూ, పందులూ, కుక్కలూ కూడా ఆహార పానీయాలను గ్రహిస్తూనే వున్నాయి కదా! పందులు అశుద్ధ వస్తువులను స్వీకరిస్తూనే వున్నాయి కదా! ఒంటెలు కంటక భక్షణం గావిస్తుంటాయి. గాడిదలు కేవలం బరువులను మోయడానికే పనికి వస్తున్నాయి. ఆలోచించి చూస్తే భగవద్భక్తి లేని మానవుడు కుక్కవలే తిరస్కారాన్ని పొందుతూ, పందివలే అసారవస్తు గ్రహణం గావిస్తూ, ఒంటి వలే దుఃఖ భరితములైన విషయ రూపకంటకములను అనుభవిస్తూ, సర్వదా దుఃఖాన్ని పొందుతూ వున్నాడు. గాడిదవలే సంసార భారాన్ని మోస్తూ రోధిస్తూ వున్నాడు. మహాత్ములైనటువంటి వారు భగవంతుని లీలాచరిత్రాలను వినని చెవులు పాముల పుట్టలవంటివనీ,భగవద్గుణ గానం చేయని నాలుకను కప్పనాలుక అనీ, శ్రీహరికి మోకరిల్లని శిరస్సు కేవలం మొండానికొక భారంగా భావించి వుండాల్సిందేనంటారు. ఎన్నో బంగారు నగలతో శోభిల్లే చేతులు శ్రీహరిని సేవించనిచో అవి శవం యొక్క హస్తాలతో సమానమనీ, స్వామి దివ్యమంగళ రూపాన్ని దర్శింపలేని కనులు నెమలిపించంలో కనిపించే కన్నుల వంటివనీ, భగవంతుడి దివ్య స్థలాలందు తిరుగాడని చరణములు కదలలేని తరులవంటివనీ వ్యర్థంగా భావించాలని సెలవిచ్చారు. స్వామి పాదాలపై వుంచిన తులసి దళం యొక్క గంధాన్ని ఆఘ్రాణింపని వాడు సజీవుడై వుండి కూడా మృతప్రాయుడి కిందే జమవుతాడని చెబుతారు. శ్రీహరి నామాలను వింటుంటే రోమాలు నిక్కపొడుచుకోవాలి, కన్నుల్లో ఆనందాశ్రువులు వెలుపలికి అప్రయత్నంగా రావాలి. అలా రాని వాని హృదయం వజ్రకఠోరమైనదిగా భావించాల్సి వుందని కొందరంటారు.

బమ్మెరపోతన గారన్నట్లుగా 'చక్రిచింతన లేని జన్మంబు జన్మమే,

తరళ సలిలబుద్బుంబుగాక, విష్ణు భక్తి లేని విబుధుండు విబుధుడే పాదయుగముతోడి పశువు గాక'. శ్రీ మద్భాగవతంలో చెప్పినట్లుగా, భగవంతుని యందే చిత్తమును లగ్నము గావించినవారు, ఆయన్నే ప్రేమించేవారు, స్వామిని కాదని బ్రహ్మపదమును గానీ, ఇంద్రపదమును గానీ, సమస్త భూచక్రవర్తిత్వాన్ని గానీ, లోకాంతరాధిపత్యాన్ని గానీ, యోగసిద్ధులను గానీ, చివరకు సాయుజ్యాది మోక్ష సుఖాలను గానీ ఆశించరు.

స్వామి యందు కలిగిన ప్రేమ స్వరూపమైన భక్తి లభించినప్పుడు మానవుడు ఏ వస్తువునూ ఆశించడు. దేనికోసమూ శోకించడు. దేనినీ ఏ వ్యక్తినీ ద్వేషింపడు. దేంట్లోనూ ఆసక్తి చూపించడు. పరమ భక్తుడైన వాడు మహత్తరమైన వస్తువునే పొందుతాడు. దాన్ని పొందితే ఇక అతగాడికి ఇచ్ఛలన్నీ అంతరించిపోతాయి. లోకంలో మనకు కనిపించే ప్రేమ, ఐశ్వర్యం, సౌందర్యం, బలమూ, యశస్సూ, జ్ఞానమూ, వైరాగ్యమూ మున్నగునవి మానవునికి ఆసక్తి కలిగిస్తూ వుంటాయో, అవన్నీ కూడా భగవంతుని ప్రేమ యందు దుర్లభమైనవిగా కనిపించినా కూడా అవి తుచ్ఛములే అవుతాయి. తులసీదాసు గారన్నట్లుగా, 'నేను సద్గతిని కోరను, శాస్త్ర జ్ఞానమును కోరను, సంపదలను కోరను, బుద్ధి సిద్ధులనూ, ప్రశంసలనూ ఆపేక్షింపను. ఆ శ్రీరామచంద్ర స్వామి చరణారవింద యుగళిపై అనుదినము అనువర్తించు నిర్హేతుక భక్తిభావం కావాలని మాత్రమే కోరుకుంటాను అన్నారు. కావున ఆయన ఒక జీవుని గానీ, లోకం దృష్టిలో ప్రతికూలంగా భావించబడే పదార్థాన్ని గానీ, ఒక పరిస్థితిని గానీ ద్వేషింపడు. సమస్త జీవులనూ, సర్వ పదార్థాలనూ, సర్వ పరిస్థితులనూ స్వామి యొక్క లీలా విశేషాలుగా భావించి, క్షణక్షణం పరమానందాన్ని అందుకుంటూ వున్నాడు. లోకమంతా ప్రభుమయంగా కనిపిస్తున్నప్పుడు ఎవ్వరితో విరోధం వుంటుంది? ఎందులకు విరోధం వుంటుంది.

"అహింసా పరమో ధర్మః"

- శ్రీ సద్గురు మలయాళస్వాములవారు

ప్రశ్న : స్వామీ! తాము 'అహింసా పరమో ధర్మః' అనిచెప్పుచున్నారే, పాలు మాత్రము హింస కాదా? పాలు మనుజులు తీయుటచే నెన్నియో దూడలు మృత్యువునకు లోనౌచున్నవి. అదియునుగాక దూడల కీశ్వరుదేర్పరచిన పాలు మనుజులపహరించుట దోషముగాదా? దయగలవారైనచో ఆ లేతదూడల కష్టము చూచి సహింతురా? అడవి జంతువులను జూడుడు. బాగుగ బాలు ద్రాగుటచే దృఢకాయము గలవిగా నున్నవి.

ఉత్తరం : ఇది మీరు చెప్పినది కొంతవరకు న్యాయమేకాని యంతయు నంగీకార్యముగాదు. జంతువులపై దయగలిగి పాలువగైరా ఏమియు నుపయోగింపనివారిని నేనెఱుంగను. మనుష్యులకు క్షీరముకన్న శరీరపోషణ వస్తువులనేకములు గలవు. ఫల మూలాదులలో శరీరమునకు గావలసిన పుష్టితత్వములు సంపూర్ణముగా గలవని సైన్సు శాస్త్రజ్ఞులు విశదముగా జెప్పుచున్నారు. వీటిలో గోధుమ, కొబ్బెర, బాదము, ద్రాక్ష, కర్జూరం, శుద్ధమగు అన్నము, కందిపప్పు మొదలుగా గల వస్తువులలోను, నితర ఫల వర్గములలోను పోషణ పదార్థము ఎక్కువ గలదని చెప్పుచున్నారు. కాని, ఇప్పుడు బాదము, ద్రాక్ష మొదలైనవి యుపయోగించుటలో ధనమధిక వ్యయమగును. మన జీవిత ఖర్చు లెంతవరకు తగ్గించుటకు సాధ్యమగునో అంత లోకములో విశ్రాంతి దొరకును. పాలు తీయునప్పుడు దూడలకు నిలువక అంతయును దీయగూడదు. మఱియు అడవి మృగముల నుదహరించినది సరికాదు. అడవి మృగములయొక్క పొదుగును స్తనములును గ్రామములో నుండెడి పశువుల వలె గొప్పవి కావు. వాటికి ఊరపశువులవలె బాలుండవు.

పాలు ఉపయోగించుటలో హింస యుండినచో మన ఋషీశ్వరులు నిషేధించి యుందురు. అంతమాత్రమేగాక, హోమ యజ్ఞ పూజాదుల కుపయోగపరచుట కేర్పాటుచేసి యుండరు. మంచి పోషణ యుండిన గొప్ప

గోవు పదిశేర్లు పాలొక దినమున కిచ్చును. ఈ పదిశేర్ల పాలను లేతదూడ త్రాగిన జీర్ణముగాదు. పాలధికముగ ద్రాగిన దూడలు మరణించును. మఱియు గ్రామములో గల దూడలకు గొన్ని పోషణ కరములగు సదుపాయముల జేయుచుందురు. ఆవులకు ధాన్యములు, నూవులు మొదలగు పోషణ పదార్థము లుపయోగపరచుచుందురు. ఈ రెండు విధులడవి జంతువులకు సిద్ధింపవు. కనుక అడవి మృగ దృష్టాంతము సరికాదు. ఈశ్వరాజ్ఞనుగూడ నతిక్రమించుట లేదు. కాని పట్టణ ప్రదేశములలో మాత్రము ఘోరకృత్యములు జరుగుచున్నవి. పాలయొక్క వెలను జూచి దూడల కివ్వక కష్టపరచుట నిజము. అనేక దూడలు మృత్యువు పాలగుచున్నవి. ఇది పాపకరము. అట్లుండు పాలు డబ్బిచ్చి తీసి త్రాగుటగూడ మంచిదికాదు. పైనుదహరించిన క్షీరమాంసములకు గూడ మార్పు గలదు. దృష్టాంతముగ లేత టెంకాయలో నుండు జలము దేవతాభిషేక యోగ్యమైనది. ఆలాటి గొలలో నుత్పత్తియగు కల్లుగూడ దేవతా పూజార్హమగునా? కల్లును, టెంకాయ పాలును నొకటే విధమైన గుణము గలదని చెప్పువారు గలరా! మఱియు మూత్రముగూడ నన్నరసము శరీరములో వ్యాపించిన తర్వాత నుత్పత్తియగుచున్నది. పాలును అదేరీతిగా శరీరములో నుండి పరిణమించుచున్నవి. ఈ రెంటికిని భేదము లేదని చెప్పుట సరియా!. యోచింపుడు. మఱియు మాంసము జంతువులను వధింపక దొరకదు. పాలను గోవులు సంతోషముగా నిచ్చుచున్నవి. గోవధచే మన దేశము పాపమునకు లోనయి దారిద్ర్యమున కునికి పట్టయినది.

హిందువులు పాలను, నేతిని విశేషముగా వాడుదురు. దీనికిగూడ క్షామమైనది. మఱియు నెందరో పేద సంసారుల భూమి బీడైపోయినది. ఒక్క జత యెద్దులను గొనుటకు సుమారు రెండు వందల రూపాయలు వెలపట్టును. దరిద్రులెట్లు కొని కృషి చేసి జీవింతురు. మఱియు బశువులు దక్కువౌటచే నెరువుగూడా సరిగా లేనందున నర్ధ ఫలితముగూడ జిక్కుటలేదు. దీనికిగారణము గోవధయు, విదేశములకు గోవుల నెగుమతి చేయుటయునని నందరికి దెలిసిన విషయము. ఈ ఘోరపాతకము నుండి సర్వేశ్వరా! మన దేశమెప్పుడు విముక్తినొందును. దీనికి గారణము గూడ మనలోగల యంధ విశ్వాసము, గాఢ సహోదర స్నేహ శూన్యతయేయని తెలివి కలుగునప్పుడు మాత్రమే దేశమున్నత స్థితికి రాగలదు. తల్లివలె గోవు పాలిచ్చి పోషించుటయు, తండ్రివలె కృషి చేసి యన్నము నొసంగుటయు జేయువాటిని వధించి తినుట బొగ్గుకొరకు గల్పవృక్షమును నరికి కాల్చినట్లే గదా? దేవతాస్వరూపమగుటచే గోవును ధేనువని తలంచి పూజించుచున్నారు. ఒక గోవుచే నెందరో జనులు జీవించుచున్నారని మేధావంతులకు విదితము. మేకలు, గొర్రెలు గూడ నీలాటి జంతువులే. ఈ విషయములను దయాళువులై ధర్మబోధన చేయవలసిన రాజయోగులలో గొందరు హింసాకృత్యం జేయుట పాపమని లోకమున కింకను దెలుపుటలేదు. అనగా నా జంతువులను సృష్టించినది దినుటకొరకేనని పాపపూర్వక వాదములు చేయుట 'ఆహా" ఎంత సంకటకరము! మనుజులను దినుటకొరకే రాక్షసులను సృష్టించినదని రాక్షసులు చెప్పిన వీరు నమ్ముదురా? అయ్యో ఎంత క్రూరకృత్యము మాంసభక్షణము మానవులకు విధిగాదు. విధియుండిన జంతువులను జీవముతో గూడ బట్టి తినవలయును. తోడేలు మొదలగు జంతువులు మాంసము దినుచున్నవి. వీటికి వాడిమియు, కూచిగలదంతములు గలవు. మానవదంతములు శాకభక్షకులగు యేనుగు, గుఱ్ఱము, జింక, గోవు మొదలుగాగల పవిత్రమృగముల పల్లులవలె సందులేనివియు, సమవరుస కలిగినవియు, కూచిగా లేనివియు అగుటచే మాంసభక్షకులు గారని పాశ్చాత్యశాస్త్రవేత్తలుగూడ గ్రహించి అనేకు లిప్పుడు శాకభక్షకులైరి. ఆలాగున జీర్ణ కోశమునకుసహితము మార్పుగలదు. కనుక మనుజులు మాంసభక్షకులు గారని ప్రకృతి బోధించుచున్నది. మాంసభక్షకులైనచో మత్స్య మాంసములను బచ్చిగా దినుటలో నసహ్యము గలుగదు. మనుజుల కదిసాధ్యమా? కనుక మీ హృదయమే మీకు సాక్షిగా నున్నది. జంతువులకు అది సాధ్యము. కాన అది వాటియొక్క ప్రకృతి గుణమని గ్రహింపుడు.

కృష్ణాజినాది యాసనములు శాస్త్ర సిద్ధములు.

ప్రశ్న : 'అహింసా పరమో ధర్మః' అని చెప్పు విషయము నిజమైనచో సాధువులు కృష్ణాజినాదులనుపయోగపరచవచ్చునా? లేడి ఎంతో పావనమగు జంతువుగా గనుపించుచున్నది. దానిని వధించుట ధర్మమా?

ఉత్తరం : ఓ సుబుద్ధిమంతుడవగు సోదరా! ఇదియును నొక ప్రశ్నయా? ఏలన నొక విషయమును జెప్పునప్పుడు శాస్త్రమునకు సరిగా నుండ వలయును. శాస్త్రములలో కృష్ణాజిన వ్యాఘ్రాసనాదులు విధించి యుండుటచే సాధువులు ఉపయోగించుచున్నారే కాని,శాస్త్ర నిషిద్ధమైనచో వారు స్వీకరింపరు.

కాని చర్మాసనము కూడా దయాళుత్వమునకు దూరమైనదే. చర్మము కావలయునని నిర్బంధము లేదు. తెలుపు వర్ణము గల కంబళిగాని, రోమములచే జేయబడిన చిత్రాసనము గాని, ధావళిగాని శ్రేష్ఠము. మహర్షులు శాస్త్రమున గృష్ణాజినాదులకు దోషము చెప్పనందుచే గొంద రుపయోగపరచుచున్నారు. సాక్షాద్భగవద్వచనమును జూడుడు. 'చేలాజిన కుశోత్తరం' అనగా మొదట దర్భాసనము దానిపై కృష్ణాజినము, తదుపరి ధావళి మొదలైన వాటిలో నేదైన నుంచి ధ్యానము చేయవలయును. వీటిలో గంబళీ, దర్భాసన మొక్కొక్కటి యైనను జాలును.

కృష్ణాజినే జ్ఞానసిద్ధి ర్మోక్షశ్రీ ర్వ్యాఘ్రచర్మణి ॥
కుశాసనే జ్ఞానసిద్ధిః సర్వసిద్ధిస్తు కంబళే ॥ (శివగీత)

తా॥ కృష్ణాజినమున జ్ఞానసిద్ధియు, వ్యాఘ్రాసనమున మోక్షలక్ష్మియు, దర్భాసనమున కృష్ణాజినమువలె జ్ఞానసిద్ధియు, ఈ మూడున్ను తెలుపువర్ణము గల కంబళియొక్క దానిలో సిద్ధించును. అనగా మోక్షలక్ష్మియు, జ్ఞాన సిద్ధియు అతీంద్రియ జ్ఞానమున్ను గాక ఇతరములగు సర్వసిద్ధులు గూడ ధవళ కంబళిపై కూర్చొని ధ్యానించువారికి సిద్ధించును. కనుక ధావళి పవిత్రమని తలంచెద.

మఱియు నాసనముకొఱకు నెవరున్ను జింకలను జంపుటలేదు. చర్మము కొఱకు జంపినచో గొప్ప పాతకము గలుగును. సంశయము లేదు. సాధారణ మాంసభక్షకులగు క్రూరులు మాంసముకొరకా సాధు జంతువులను వధించెదరే కాని చర్మముకొఱకు గాదు. మాంసము దీసుకొనిన వారికి నుపయోగము లేకుండెడి చర్మము దొరకినచో సాధువు లుపయోగ పరచవచ్చును. మనః పారిశుద్ధ్యము లేనివారికెన్ని యాసనము లుండినను కించిత్తైనను బ్రయోజన ముండదు. ఆత్మశుద్ధిగలవారికి నేయాసనమున్ను పనిలేదు. మరియు మనుజుల కుపయోగకరమైన యన్నాది పైర్లను నాశము చేసెడు వన్యమృగములను గ్రామ పాలకులు వధించుటకు శాస్త్ర విధిగలదు. లేనిచో గృహస్థ ధర్మము జరుగదు. కాని యడవులలో ప్రవేశించి నిరపరాధులగు జంతువులను వేటాడుట పాపకరము. అవి నిర్దోషులు. ఎవరికిన్ని యేలాటి కీడు చేయుటలేదు. ఇప్పుడుగల రాజులలో గొందరు చిన్న చిన్న కొండలలో లేడి మొదలగు సాధు జంతువులను బెంచి తమాషాగా వేటాడుట ఘోరమగు క్రూరకృత్యము. ఆ చిన్న చిన్న యడవుల ప్రక్క నుండు వ్యవసాయదాగుల కృషి నా జంతువులు నాశ మొనర్చినను రైతులా జంతువులకు భయోత్పాదనము

గూడ జేయగూడదనుటదేమి ధర్మము. రాజులట్లేర్పాటు చేయు సూత్రమేమన నిది వారి యొక్క దయాళుత్వము గాదు. రాజులకు వినోదార్థముగ మృగయా వినోదముకొఱకే. దీని కొఱకు ఈలాటి దుష్ట సంకల్పము గలుగ జేయు చున్నారు. ఇది పిల్లికి నుత్సవము, ఎలుకకు మరణమని చెప్పురీతిగా నున్నది. వన్యమృగములు వాటి స్థానము వదలి మనుజుల కన్నమగు పైరు మేయుటలో నవిన్ని ధర్మము దప్పినందున దండనార్హములు. గాని యవి తెలివిలేని జంతువులు. సాధ్యమైనంత వరకు వాటిని భయపెట్టి తోలుట మంచిది. ఇదియే నిజమగు దయాళుత్వము. అంతమాత్రపు వారిప్పుడుండుట దుస్తరము. పైనుదహరించిను రీతిని బైరుకు నష్టము చేయుటగాని, పులులు గోవులను, గొఱ్ఱెలను జంపుచుండినచో నవిన్ని దండనార్హములు. ఈలాగున జంపంబడిన వాని చర్మములు మాత్రము గావలసియుండిన సాధులుపయోగపరచవచ్చును. దుష్ట మృగములనే గాక దుష్ట మనుజుడై పరులను బాధించినచో నతడుకూడ దండనార్హుడే. ఇది జనులను రక్షించెడివారి ధర్మము. ఆలాగుననే జంతువులుగూడ. కృష్ణాజినాదులలో కించిద్దోషముండినను దానిలో కూర్చొని తపస్సు చేయుట యోగసిద్ధిగలిగెడువారికి నా దోషమంత బాధింపదు. ఏలన నొక రూపాయ నప్పుతీసి యొక వ్యాపారము చేసిన దానిచే నైదురూపాయలు లాభము గల్గిన ఒక రూపాయి యప్పుపోయి యింకా నాలుగు రూపాయలు మిగులును గదా! ఇది గొప్ప బ్రహ్మనిష్ఠ గలవారికి జెల్లునే గాని తక్కిన వారికి గృష్ణాజినాదులు మంచివి కావు.

ప్రశ్న : సరి అప్పుడొక్కరికి శరీరసుఖము లేనిచో ప్రాణిహింస చేసి మాంసము భుజించి సుఖపడిన తర్వాత తపస్సు చేయుచుండినచో, ఆహింసచే దోషము లేదు గదా! ఏలన వారికి హింసాదోషము గొంచెముండిన మరల తపః శక్తిచే గొప్ప మాహాత్మ్యము గలుగును గదా.

ఉత్తరము : ఇది సరికాదు, ఏలన జింక చర్మముకొఱకు వధించుట లేదని ముందే చెప్పబడినది గదా! జంతువధ యట్లుగాదు. వాటిని తినుట కొరకే వధించుచున్నారు. మఱియు నొక్క చర్మముండినచో నొక్కరి యా యుష్కాలము జాలను. మాంసభక్షణమట్లు కాదు. అది ప్రతిదినము, లేక ప్రతివారము కనిష్ఠపక్షమున మాంసముండవలయును. దీనికి ననేక

ప్రాణులను వధించుట కవకాశము గలుగును. మఱియు మాంసాహారము రసమై, రసమునుండి రక్తము, రక్తముచే శరీరము ననుసరించి వృత్తులు కూడ గలుగును. కనుక మాంసభక్షకులకు క్రూర స్వభావ మధికమై మరల మరల తమోగుణము వృద్ధియై పాపబుద్ధియే గలుగుచుండును. ఒకవేళ మాంసభక్షణము చేయువారిలో నెవరికైన శాంతసద్గుణము లుండిన నా మాంసభక్షణము లేనిచో నింకా యెక్కువ జ్ఞానవంతులై యుండవచ్చును. చర్మము పైన చెప్పిన రీతి కాదు.

ప్రశ్న : కృష్ణాజినాదులలో కూర్చుండి ధ్యానించుటలో నేదైన విశేష ఫలము కలదా ?

ఉత్తరం : కృష్ణాజినాదులలో ప్రయోజనము లేనిచో ఋషులు వాటిని స్వీకరించియుండరు. శాస్త్రముకూడ జెప్పదు. కనుక వాటిలో నేదోయొక ఫలముండును. కాని శమదమాది సద్గుణములు గలవారికి మాత్రమే వాటి గుణములు కలుగును. లేనివారి కించుకైన నుపయోగపడదు. ఎట్లన విరేచనౌషధము సేవించి యుష్ణోదకము దీసికొని మధ్యాహ్నము వఱకు భోజనముచేయుకుండిన విరేచనముగలుగునను విధానముండిన మందు దిన్నప్పుడే కడుపునిండ బెరుగన్నముగాని, పులుసన్నముగాని భుజించిన బేదియగునా? బేది కానందున ఔషధమునకు శక్తి లేదని చెప్పవచ్చునా? కృష్ణాజినాదులచే గల యుపయోగమేమన, భూమికి సదా ఆకర్షణ శక్తి గలదు. ధ్యానయోగానుష్ఠాన కాలమున బరిశుద్ధ హృదయముగలవారికి గుండలనీశక్తి యెక్కువగా ప్రజ్వలించును. ఆ శక్తి కుశాసన కృష్ణాజినాదులు, రోమకంబళి మొదలైన వాటిద్వారా భూమిలోనికి నాకర్షణశక్తిచే దిగిపోదు. దీని కొఱకే పావుకోళ్లుగూడ యేర్పడినవి. మఱియు తపోవిఘ్నముచేయు భూతప్రేతపిశాచాసురులు గలరు. వారు కృష్ణాజినాది ఆసనములలో నుండునప్పుడు బాధింపజాలరు. దీనికొఱకే బ్రాహ్మచారులకు ఉపనయన కాలమున గృష్ణాజినమును యజ్ఞోపవీతముతోకూడ నుపయోగపరచు రహస్యము. అదెట్లన కొన్ని గ్రహముల నిర్బాధకొఱకు వనమూలికలను గొందరుపయోగపరచురీతి నిదియు నొక్క విధమైన ఆత్మసంరక్షణయే. కాని భక్తి గలవారికిన్ని ఫలాపేక్షలేనివారికిని తపోధ్యానయోగాదుల జేయునప్పుడు కూడ కృష్ణాజినాది చర్మాసనము లావశ్యకము లేదు.

వార్తలు

(01). 9-5-2019 తేది వైశాఖ శుద్ధపంచమి గురువారం నాడు శ్రీ శుకబ్రహ్మాశ్రమంలో జగద్గురు శంకరాచార్యులవారి జయన్తి జరిగినది. అద్వైతమత సంస్థాపకులు, దశనామ సన్న్యాస సాంప్రదాయానికి మూలపురుషులు అయిన జగద్గురు శంకరాచార్యులవారి పావన మూర్తికి షోడశోపచార పూజ జరిగినది. పూజానన్తరం, ఆచార్యుల భజగోవిందానికి ఆశ్రమవాసి బ్రహ్మచారి విజయానన్ద గారు రచించిన గేయాలను సుమధురంగా వారే పాడారు. ప్రసాద వినియోగం, పరిసర భక్తులందరికి భిక్ష జరుపబడింది. ఆచార్యుల వారి సాధన పంచకంపై సాయంకాలం పూజ్యశ్రీ స్వాములవారు ప్రవచన చేశారు.

(02). 18-5-2019 తేది వైశాఖ పౌర్ణమినాడు ఆశ్రమంలో వ్యాసపౌర్ణమి సందర్భంగా వేదవ్యాసులవారికి అర్చన జరిగినది. అట్లే గురుదేవుల పాదుకలకు యథారీతి అభిషేకం అర్చన జరిగినది. ప్రస్థాన త్రయ పారాయణ జరిగినది.సాయంకాలం వ్యాసరచిత బ్రహ్మసూత్రాలపై పూజ్యశ్రీ స్వాములవారు ప్రవచన చేశారు.

(03). మే 29వ తేది బుధవారంనాడు హనుమద్ జయన్తి శ్రీశుకబ్రహ్మాశ్రమంలో జరిగినది. ఆశ్రమంలోని పవిత్ర హనుమన్మూర్తికి పూజలు జరిగాయి. హనుమాన్ చాలీసా పారాయణ జరిగినది.

(04). జూన్ 3వ తేది వైశాఖ అమావాస్య సోమవారం నాడు మహబూబ్‌నగర్ జిల్లా, జడ్చర్ల సమీపం కావేరమ్మపేటలోని శ్రీ గిరి అష్టలక్ష్మీ క్షేత్రంలో ఆచార్య కృష్ణానందస్వామి గారి ఆధ్వర్యంలో జరిగిన అష్టలక్ష్మీక్షేత్రం వార్షికోత్సవంలో పూజ్యశ్రీ స్వాములవారు పాల్గొంటారు.

(05). జూన్ 28,29, 30 తేదీలలో అనంతపురం జిల్లా ఉరవకొండ సమీపం లత్తవరంలో శ్రీ ఉమామహేశ్వర ప్రథమ పీఠాధిపతులు పూజ్యశ్రీ శంకరానందగిరి స్వాములవారి శతజయంత్యుత్సవాలలో శ్రీ విద్యా స్వరూపానందగిరి స్వాములవారు పాల్గొంటారు.

(06). ఆశ్రమ కంటి ఆసుపత్రిలో ఏప్రిల్ నెలలో ఓ.పి. విభాగంలో **984 మందికి** కళ్ళ పరీక్షలు చేసి తగు చికిత్సలు చేయబడినవి. **78 మందికి** కళ్ళ పొరలు తీసి కళ్ళలో లెన్సు అమర్చబడినవి. **3 గురికి** యాగ్‌లేజర్ చికిత్స చేయబడినది. ఒక గ్రామీణ వైద్య శిబిరం నిర్వహింపబడినది.